RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్

తెలుగు దినపత్రిక

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

CITIZEN TIMES TELUGU DAILY

VOLUME: 17 | ISSUE: 273 | EDITOR: KANCHERLA SANDEEP KUMAR | VISAKHAPATNAM 28-4-2026 | Pages: 8 | Rs: 2/-

సంపుటి : 17 | సంచిక : 273 | ఎడిటర్ : కంచర్ల సందీప్ కుమార్ | విశాఖపట్నం 28-4-2026 | పేజీలు : 8 | రూ: 2/-



- విశాఖలో అట్టహాసంగా ఏయూ శతాబ్ది ఉత్సవాలు.. ప్రముఖులతో వెలిగిపోయిన వేదిక
- విశాఖలో ఘనంగా ప్రారంభమైన ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుక
- ముఖ్య అతిథిగా ఉపరాష్ట్రపతి.. హాజరైన సీఎం చంద్రబాబు
- పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, గవర్నర్లు, ప్రజాప్రతినిధుల హాజరు
- వేడుకల్లో పాల్గొన్న క్రికెట్ దిగ్గజం సచిన్, ఏయూ పూర్వ విద్యార్థి, సినీ దర్శకుడు త్రివిక్రమ్
- 25 వేల మందికి పైగా విద్యార్థులు, పూర్వ విద్యార్థులతో నిండిన ప్రాంగణం
- ఆంధ్రా యూనివర్సిటీకి రూ.500 కోట్ల నిధులను ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు




# దేశంలోని అనేక యూనివర్సిటీలకు ఏయూనే దిక్సూచి



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్**

శత వసంతాల చారిత్రక ప్రస్థానానికి గుర్తుగా, ఆంధ్ర విశ్వవిద్యాలయం (ఏయూ) శతాబ్ది ఉత్సవాల ముగింపు కార్యక్రమం సోమవారం విశాఖపట్నంలో అత్యంత వైభవంగా ప్రారంభమైంది. దేశానికి ఎందరో మేధావులను, రాజకీయ ప్రముఖులను, ఉన్నతాధికారులను అందించిన ఈ సరస్వతీ నిలయం వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న ఈ వేడుకలకు ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానం వేదికైంది. విద్యార్థులు, పూర్వ విద్యార్థుల కేరింతలతో ప్రాంగణం మొత్తం పండుగ వాతావరణంలో మునిగిపోయింది. ఈ చారిత్రక ఘట్టానికి ముఖ్య అతిథిగా భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఒడిశా గవర్నర్ కె. హరిబాబు, మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు, ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, భూపతిరాజు శ్రీనివాస వర్మ,

తరువాయి 2లో..

# ఇప్పుడు వెళ్తున్నా.. ఆరోజు మళ్లీ తిరిగొస్తా

## బెంగాల్‌లో మోదీ



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

బెంగాల్‌లో భాజపా అధికారంలోకి వస్తుందని ప్రధాని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో నేడు చివరి ర్యాలీలో పాల్గొన్నానని.. మళ్లీ బెంగాల్‌లో భాజపా ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాష్ట్రానికి తిరిగి వస్తానని ఆశిస్తున్నట్లు తెలిపారు. మే 4న ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక రాష్ట్రమంతా మిఠాయిలు పంచుతామన్నారు. అదే ఉత్సాహంతో నేడు తాను వెళు న్నట్లు పేర్కొన్నారు. తాను హెలిప్యాడ్ దిగి వస్తుంటే దాదాపు 2 కిలోమీటర్ల దూరం వరకు ఇరువైపులా ప్రజలు ఎదురుచూస్తూ ఉన్నారని అన్నారు. తనను ఆశీర్వదించడానికి వేలాదిమంది ప్రజలు వస్తారని ఊహించలేదని సంతోషం వ్యక్తంచేశారు. బెంగాల్‌లోని బారక్‌పుర్‌లో నిర్వహించిన ప్రచారంలో ఈ

తరువాయి 2లో..



# ఒకటికి నాలుగు..మా లెక్క వేరేలే

## అమెరికాకు ఇరాన్ వార్నింగ్

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

మూడు రోజుల్లో ఒప్పందం కుదుర్చుకోకపోతే ఇరాన్ చమురు పైప్‌లైన్లను పేల్చేస్తానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించడంపై ఇరాన్ స్పందించింది. చమురు క్షేత్రాలు సహా తమ మౌలిక సదుపాయాలపై దాడులకు పాల్పడితే.. అమెరికాకు మద్దతిచ్చే దేశాల్లో దానికి నాలుగు రెట్లు ఎక్కువగా విధ్వంసానికి పాల్పడతామని ఉపాధ్యక్షుడు ఇస్మాయిల్ సాహెబ్ ఇస్ఫహానీ హెచ్చరించారు. తమ లెక్కలు అందరిలా కాకుండా భిన్నంగా ఉంటాయన్నారు. శత్రువులు ఒక్క చమురు బావిపై దాడి చేస్తే.. తాము నాలుగు చమురు బావులపై దాడులు చేస్తామన్నారు. గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలు,

తరువాయి 2లో..

# నాలాంటి వాళ్లకు ఇదొక ఎమోషన్

ఆంధ్రా యూనివర్సిటీ ఒక సంస్థ మాత్రమే కాదు.. ఒక ఎమోషన్ అన్న మంత్రి నారా లోకేష్

దేశంలోనే ఏయూకు ఓవరాల్‌గా 3వ ర్యాంక్ సాధించడమే లక్ష్యం

ఏడాదిలోగా యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ

పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కరిక్యులమ్‌లో మార్పులు తెస్తామని వెల్లడి



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్**

ఆంధ్రా యూనివర్సిటీ (ఏయూ) కేవలం ఒక విద్యాసంస్థ మాత్రమే కాదని, తన లాంటి వారికి అదొక ఎమోషన్ అని, ఇది ఆంధ్రప్రదేశ్‌కే కాక యావత్ భారతదేశానికే గర్వకారణమని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. సోమవారం విశాఖపట్నంలోని ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో అత్యంత వైభవంగా జరిగిన విశ్వవిద్యాలయ శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలో ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి పాల్గొన్నారు. ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ చారిత్రాత్మక కార్యక్రమంలో లోకేష్ కీలక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. "శతాబ్ద కాలంగా విజ్ఞాన కాంతులు పంచుతున్న ఏయూ గొప్పదనాన్ని జరుపుకోవడం

తరువాయి 2లో..

# దక్షిణ కోటను బద్దలుకొట్టేదెలా?

## మమత ప్రభావంపై భాజపా వ్యూహాలు



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

పశ్చిమ బెంగాల్‌లో రెండో విడత పోలింగ్ జరగనున్న 142 నియోజకవర్గాలపై తృణమూల్, భాజపా దృష్టి సారించాయి. గత ఎన్నికల్లో సాధించిన పట్టును నిలబెట్టుకోవాలని తృణమూల్, ఎలాగైనా మమత ప్రభావాన్ని తగ్గించాలని భాజపా తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. 2021లో జరిగిన ఎన్నికల్లో ఈ ప్రాంతంలోని 123 సీట్లను తృణమూల్ గెలుచుకుంది. ఈ నెల 29వ తేదీన ఈ నియోజకవర్గాల్లో పోలింగ్ జరగనుంది.

**తృణమూల్ కంచుకోటలే..**

మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్‌కు దక్షిణ బెంగాల్, కోల్‌కతా కంచుకోటలే. గత ఎన్నికల్లో 77 సీట్లను గెలుచుకున్న భాజపా ప్రధాన ప్రతిపక్ష పార్టీ హోదాను సాధించింది. దీనికి ఉత్తర బెంగాల్‌లో ఆ పార్టీ సాధించిన విజయాలే కారణం. ఈసారి దక్షిణ బెంగాల్‌లో ఈ స్థాయి విజయాలను సాధించాలని ఆ పార్టీ ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా దృష్టి సారించారు.

**8 జిల్లాల్లో..**

రెండో విడత పోలింగ్ జరిగే నియోజకవర్గాలు 8 జిల్లాలో విస్తరించి ఉన్నాయి. అవి ఉత్తర కోల్‌కతా, దక్షిణ కోల్‌కతా (రెండూ కలిపి 11 సీట్లు), హావ్‌డా (16 సీట్లు), నాదియా

తరువాయి 2లో..

# బీజేపీలో ఆప్ ఎంపీల విలీనానికి రాజ్యసభ ఆమోదం

బీజేపీలో చేరిన ఏడుగురు ఆప్ రాజ్యసభ సభ్యులు

బీజేపీ పార్లమెంటరీ పార్టీలో విలీనం

ఈ విలీనాన్ని రాజ్యసభ చైర్మన్ ఆమోదించారన్న కిరణ్ రిజిజు



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

జాతీయ రాజకీయాల్లో పెను సంచలనం నమోదైంది. ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఏడుగురు రాజ్యసభ సభ్యులు అధికారికంగా బీజేపీ పార్లమెంటరీ పార్టీలో విలీనమయ్యారు. ఈ మేరకు రాజ్యసభ చైర్మన్ ఈ విలీనాన్ని ఆమోదించినట్లు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. బీజేపీలో చేరిన

తరువాయి 2లో..

# విజయం కన్నా ఓటమే గొప్ప పాఠం నేర్పుతుంది

ఏయూ శతాబ్ది వేడుకల్లో ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

ఆంధ్రా యూనివర్సిటీ శతాబ్ది వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉపరాష్ట్రపతి

అంతర్గత ఒత్తిడిని జయించడంపై విద్యార్థులకు కీలక సందేశం


విజయం కంటే ఓటమి నుంచే ఎక్కువ నేర్చుకోవచ్చని వ్యాఖ్య

ఏపీ అభివృద్ధి ప్రయాణాన్ని, సీఎం చంద్రబాబు నాయకత్వాన్ని ప్రశంసించిన ఉపరాష్ట్రపతి

ప్రపంచస్థాయి విశ్వవిద్యాలయంగా ఏయూ ఎదగాలని ఆకాంక్ష

**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్**

విజయం సాధించాలంటే ముందు మన అంతర్గత ఒత్తిడిని జయించాలని, అప్పుడే లక్ష్యాన్ని చేరుకోగలమని భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరిలో ఉండే అంతర్గత ఒత్తిడిని అధిగమించగలిగితేనే ఏ రంగంలోనైనా రాణించగలమని స్పష్టం చేశారు. విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ (ఏయూ)



తరువాయి 2లో..

## ఎడిటోరియల్

### 'మోడీ–ఈడీ'.. తారెత్తుతున్న నినాదం!

జాతీయస్థాయిలో ఓ నినాదం దుమ్మురేపుతోంది. ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఏడుగురు రాజ్యసభ సభ్యుల ను బీజేపీ చేర్చుకునేందుకు రెడీ అయిన నేపథ్యంలో –మోడీ.. కాదంటే ఈడీ– నినాదం ఇప్పుడు ఢిల్లీ వీధుల్లో కనిపిస్తోంది. ఎవరు అంటించారో.. ఎప్పుడు అంటించారో తెలియదు కానీ.. రాత్రికి రాత్రి ఢిల్లీలోని దుకాణాలు.. వీధుల్లో పెద్ద ఎత్తున పోస్టర్లు కనిపించాయి. దీంతో ఢిల్లీ మునిసిపల్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన వీటిని తొలగించే పనిని చేపట్టారు. వాస్తవానికి ఆప్‌లో ఉన్న వారంతా ఆ పార్టీ అధినేత కేజ్రీవాల్ కు అత్యంత విధేయులనే పేరుంది. అయితే.. ఆప్‌ను అంతం చేస్తామని.. గత ఏడాది కేంద్ర మంత్రి అమిత్ షా.. ఢిల్లీలో జరిగిన ఓ సమావేశంలో ప్రకటించారు. దీనికి ముందు ఢిల్లీ ఎన్నికల సమయంలోనూ ఆయన ఇదే విధంగా ప్రచారం చేశారు. --ఈ ఎన్నికలే ఆప్‌కు చివరి ఎన్నికలు. మీరు చూస్తారు. ఇక ఆపార్టీ ఉండదు. రాసి పెట్టుకోండి-- అని ఉద్ఘాటించారు. అయితే.. దీనిని కొందరు లైట్ తీసుకున్నారు. కానీ.. కేజ్రీవాల్ మాత్రం అప్రమత్తంగానే ఉన్నారు. అయితే.. నిన్న మొన్నటివరకు బీజేపీ ఈ విషయంపై మౌనంగానే ఉంది. కానీ, ఈలోగా.. ఢిల్లీ కోర్టు మద్యం కేసులో కేజ్రీవాల్ సహా.. ఆప్ నేతలకు.. ఈ కేసులో ఉన్న కవిత సహా ఇతరులకు క్లీన్ చిట్ ఇచ్చేసింది. దీంతో బీజేపీ ఇరుకున పడింది. పైగా కేజ్రీవాల్.. మద్యం కేసు విషయాన్ని మరింత దూకుడుగా ప్రజల మధ్యకు తీసుకువెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో బీజేపీ ఆత్మరక్షణలో పడింది. తాము ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కేసు వీగిపోతున్న నేపథ్యంలో రాజకీయంగాపావులు కదిపింది. ఈ క్రమంలోనే రాఘవ్ చద్దాను అడ్డు పెట్టుకుని.. పాచిక పారించేలా చేసిందన్న విమర్శలు బీజేపీ చుట్టూ ముసిరాయి. ఇటీవల ఆప్.. నేత.. అశోక్ మిట్టల్ ప్రైవేటు విశ్వవిద్యాలయంపై ఈడీ అధికారులు దాడులు చేశారు. ఈ జాబితాలో ఇతర నాయకులు కూడా ఉన్నారన్న చర్చ జరిగింది. ఇది జరిగి.. నాలుగు రోజులు కూడా గడవకుండానే.. వారంతా బీజేపీ తీర్థం పుచ్చుకునేందుకు రాఘవ చద్దా వెంట పయనించడంతో ఇప్పుడు –మోడీ.. కాదంటే ఈడీ–నినాదాన్ని ఆప్ పెద్ద ఎత్తున ప్రచారంలోకి తీసుకువచ్చింది.

# దేశంలోని అనేక యూనివర్సిటీలకు ఏయూనే దిక్సూచి

విశాఖ ఎంపీ ఎం. శ్రీభరత్, పలువురు రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్, ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థి, ప్రముఖ టాలీవుడ్ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కూడా ఈ వేడుకల్లో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా, ఆంధ్ర విశ్వవిద్యాలయం వందేళ్ల ఘనతకు గుర్తుగా ప్రత్యేక పోస్టల్ స్టాంపును ఆవిష్కరించారు. వర్సిటీ అభివృద్ధి పనులను కూడా ఇదే వేదిక నుంచి ప్రారంభించారు. పరిశోధనలకు ఆయువుపట్టుగా, ఎన్నో ఆవిష్కరణలకు వేదికగా నిలిచిన ఆంధ్ర విశ్వవిద్యాలయం ఘన చరిత్రను భావితరాలకు తెలియజేయాలనే లక్ష్యంతో ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ వేడుకల కోసం సుమారు 25 వేల మందికి పైగా ప్రస్తుత, పూర్వ విద్యార్థులు తరలివచ్చారు. వారి కోసం మూడు భారీ జర్మన్ షెడ్లను ఏర్పాటు చేసి, 36 విభాగాలుగా సీటింగ్ ఏర్పాట్లు చేశారు. ప్రధాన వేదికకు ఇరువైపులా ఏర్పాటు చేసిన భారీ ఎల్‌ఈడీ స్క్రీన్లు, ఆకర్షణీయమైన అలంకరణలతో ప్రాంగణం కొత్త కాంతులతో వెలిగిపోయింది. ఈ శతాబ్ది ఉత్సవాలు విశ్వవిద్యాలయ చరిత్రలో ఒక సువర్ణాధ్యాయంగా నిలిచిపోనున్నాయి.

ఆంధ్రా యూనివర్సిటీని ప్రపంచంలోని టాప్ 100, దేశంలోని టాప్ 5 విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా నిలపాలన్నదే తన లక్ష్యమని, ఇందుకు తొలి విడతగా రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.500 కోట్ల నిధులను మంజూరు చేస్తున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ 100 సంవత్సరాల ఉత్సవాల ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ అభివృద్ధికి తన దార్శనికతను, ప్రభుత్వ ప్రణాళికలను ఆవిష్కరించారు.

**విశాఖ అభివృద్ధి అన్‌స్టాపబుల్**

విశాఖ నగరం రేపటి నుంచి గ్లోబల్ సిటీగా మారబోతోందని, దీని అభివృద్ధి ఇక అన్‌స్టాపబుల్ అని చంద్రబాబు అన్నారు. నగరానికి రానున్న అతిపెద్ద గూగుల్ డేటా సెంటర్‌కు మంగళవారం శంకుస్థాపన చేయనున్నట్టు వెల్లడించారు. యూనివర్సిటీలో ఇప్పటికే రూ.64 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించినట్టు తెలిపారు. విద్యాలయాలు కేవలం డిగ్రీలు, పట్టాలు ఇచ్చే కేంద్రాలుగా కాకుండా, నూతన ఆవిష్కరణలకు వేదికగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. సచిన్ టెండూల్కర్ చెప్పినట్టుగా, విశాఖ సముద్ర తీరంలోని ప్రశాంత వాతావరణం ఎంతో శక్తిని ఇస్తుందని అన్నారు.

**యువతకు స్ఫూర్తిదాయక సందేశం**

"చాలామంది నా వయసు 76 అంటారు, కానీ నేనెప్పుడూ అలా అనుకోను. నా ఆలోచనలు 26 ఏళ్ల వ్యక్తిలా ఉంటాయి" అంటూ యువతను ఉత్తేజపరిచారు. గతంలో తాను ఐటీని తీసుకొస్తే, ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్వాంటం టెక్నాలజీల గురించి మాట్లాడుతున్నామని, భవిష్యత్ సాంకేతికతపై దృష్టి సారించాలని సూచించారు. "నాలెడ్జ్, ఇన్నోవేషన్, టెక్నాలజీపై దృష్టి పెడితే సాధారణ వ్యక్తులు కూడా అసాధారణ విజయాలు సాధించవచ్చు. మీరు ఉద్యోగాలు చేయడం కాదు, వందల మందికి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి. అందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుంది," అని భరోసా ఇచ్చారు.

**ఏయూ ఘన చరిత్ర.. పూర్వ విద్యార్థులకు పిలుపు**

ఆంధ్రా యూనివర్సిటీకి వందేళ్ల ఘన చరిత్ర ఉందని, దీనికి తొలి వీసీ కట్టమంచి రామలింగారెడ్డి బలమైన పునాదులు వేయగా, రెండో వీసీ సర్వేపల్లి రాధాకృష్ణన్ రాష్ట్రపతిగా ఎదిగారని గుర్తుచేశారు. ఈ వర్సిటీ రచయితలకు, కళాకారులకు 'కళాప్రపూర్ణ' బిరుదులిచ్చి గౌరవించిందని, ప్రస్తుతం 58 దేశాల విద్యార్థులు ఇక్కడ చదువుకోవడం గర్వకారణమని అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.500 కోట్లకు అదనంగా, పూర్వ విద్యార్థులు, దాతలు మరో రూ.500 కోట్లు సమీకరించాలని పిలుపునిచ్చారు. ఇక్కడే చదివిన గ్రంధి మల్లికార్జునరావు వంటి దిగ్గజాలు తల్చుకుంటే ఇది అసాధ్యం కాదని ఆశాభావం వ్యక్తం చేశారు.

**స్వర్ణాంధ్రప్రదేశ్ 2047 నిర్మాణమే లక్ష్యం**

తాను, తన మిత్రుడు పవన్ కల్యాణ్ కలిసి ప్రధాని నరేంద్ర మోదీ పూర్తి సహకారంతో ఈ రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేయడానికి కట్టుబడి ఉన్నామని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రధాని సంకల్పం 'వికసిత భారత్ 2047' అయితే, తమ సంకల్పం 'స్వర్ణాంధ్రప్రదేశ్ 2047' అని పునరుద్ఘాటించారు. ఆ సంకల్ప సాధన కోసం జైత్రయాత్రను ఈ ఆంధ్రా యూనివర్సిటీ నుంచే ప్రారంభిస్తున్నామని ఆయన ఉద్ఘాటించారు. పిల్లలకు ఇచ్చే అసలైన ఆస్తి చదువేనని, దానిని అందించడంలో ప్రభుత్వం వెనకడుగు వేయదని హామీ ఇచ్చారు.

# దక్షిణ కోటను బద్దలుకొట్టేదెలా?

(17 సీట్లు), ఉత్తర 24 పరగణాలు (33 సీట్లు), దక్షిణ 24 పరగణాలు (31 సీట్లు), హూగ్లీ (18 సీట్లు), పూర్వ బర్ధమాన్ (16 సీట్లు). 2021లో భాజపా తీవ్ర స్థాయిలో ప్రయత్నించినా 18 సీట్లనే గెలవగలిగింది. మిగిలిన ఒక సీటును ఇండియన్ సెక్యులర్ ఫ్రంట్ (ఐఎస్ఎఫ్) గెలుచుకుంది.

**తేలనున్న కీలక నేతల భవితవ్యం**

రెండో విడతలో మమతా బెనర్జీ, ప్రతిపక్ష నేత సువేందు అధికారి తదితర కీలక నేతల భవితవ్యం తేలనుంది. భవానీపూర్‌లో అగ్ర నేతలిద్దరు పోటీపడుతున్నారు. ఇంకా తృణమూల్ నేత, కోల్‌కతా మేయరు ఫర్హాన్ హకీం, మంత్రులు చంద్రిమ భట్టాచార్య, శశి పంజా, అరూప్ బిశ్వాస్, బ్రత్య బసు తదితరులున్నారు. ఆర్‌జీ కర్ ఆసుపత్రిలో హత్యాచారానికి గురైన జూనియర్ డాక్టర్ తల్లి కూడా ఈ దశలోనే అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. భాజపా నుంచి పోటీ చేస్తున్న స్వపన్ దాస్ గుప్తా, నటి, రాజకీయ నేత రూపా గంగూలీ ఈ దశలోనే పోటీలో ఉన్నారు. మమత, సువేందు అధికారి పోటీ చేస్తున్న భవానీపూర్‌లో సర్‌లో భాగంగా 51,000 ఓట్లను ఎన్నికల సంఘం తొలగించింది. మొత్తం ఓట్లలో ఇవి 21శాతం. గత ఎన్నికల్లో మమతకు 58,800 ఓట్ల మెజారిటీ వచ్చింది. ఈ నేపథ్యంలో తృణమూల్‌లో ఆందోళన నెలకొంది. అందుకే తొలిసారిగా మమత క్షేత్ర స్థాయిలో ప్రచారం చేశారు. పలువురిని స్వయంగా కలిశారు. కాస్మోపాలిటన్ ప్రాంతమైన భవానీపూర్‌లో జైన్ మందిరాలను, సిక్కుల గురుద్వారాలను సందర్శించారు. బహుళ అంతస్తుల్లోని కుటుంబాలను కలిశారు.

# విజయం కన్నా ఓటమే గొప్ప పాఠం నేర్పుతుంది

శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌ను ఉదాహరణగా చూపుతూ ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "క్రికెట్ దేవుడిగా పిలిచే సచిన్ టెండూల్కర్ కూడా తన 100వ సెంచరీ చేయడానికి చాలా సమయం తీసుకున్నారు. ఆ సమయంలో ఆయన తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొన్నారు. కానీ, ఓపికతో, పట్టుదలతో ఆ ఒత్తిడిని జయించి తన లక్ష్యాన్ని సాధించారు. జీవితంలో గెలుపోటములు సహజం. నిజానికి విజయం కంటే ఓటములే మనకు ఎక్కువ గుణపాఠాలు నేర్పుతాయి. కాబట్టి ఓటమికి భయపడకుండా, మరింత ధైర్యంతో ముందుకు సాగాలి" అని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఆంధ్రా యూనివర్సిటీ వందేళ్ల చరిత్రను, దేశానికి అందించిన సేవలను ఉపరాష్ట్రపతి కొనియాడారు. ఈ విశ్వవిద్యాలయం వందేళ్లుగా ఎన్నో చారిత్రక ఘట్టాలకు సాక్ష్యంగా నిలిచిందని, ఎందరో మేధావులను దేశానికి అందించిందని గుర్తుచేశారు. ముఖ్యంగా ఈ యూనివర్సిటీ రెండో ఉపకులపతిగా పనిచేసి, ఆ తర్వాత భారత తొలి ఉపరాష్ట్రపతిగా, రెండో రాష్ట్రపతిగా సేవలందించిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మేధోసంపత్తిని, నైతిక స్పష్టతను స్మరించుకున్నారు. విద్య ద్వారా మేధస్సుతో పాటు వ్యక్తిత్వాన్ని కూడా పెంపొందించాలన్న ఆయన ఆశయం నేటికీ ఆదర్శనీయమన్నారు. నోబెల్ బహుమతి గ్రహీత సర్ సీవీ రామన్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు వంటి ఎందరో ప్రముఖులు ఈ విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థులు కావడం గర్వకారణమన్నారు. శాంతిస్వరూప్ భట్నాగర్, పద్మవిభూషణ్, పద్మశ్రీ వంటి ఎన్నో పురస్కారాలు పొందిన మేధావులను అందించిన ఘనత ఏయూదని ప్రశంసించారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రయాణంపై కూడా ఉపరాష్ట్రపతి ప్రశంసలు కురిపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనిక నాయకత్వంలో రాష్ట్రం వేగంగా అభివృద్ధి పథంలో పయనిస్తోందని అన్నారు. గూగుల్ వంటి అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడం, ఆంధ్రప్రదేశ్ సామర్థ్యంపై పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. అమరావతిని శాశ్వత రాజధానిగా ప్రకటించే బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందినప్పుడు తాను రాజ్యసభకు అధ్యక్షత వహించానని, ఆ క్షణంలో ఏపీ ప్రజల ముఖాల్లో ఆనందాన్ని చూశానని గుర్తు చేసుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షిస్తున్న "వికసిత భారత్" నిర్మాణానికి "వికసిత ఆంధ్రప్రదేశ్" దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రతిభను సరైన మార్గంలో ఉపయోగిస్తేనే గొప్ప విజయాలు సాధ్యమవుతాయని సూచించారు. భవిష్యత్తులో ఆంధ్రా యూనివర్సిటీ జాతీయంగానే కాకుండా, అంతర్జాతీయ పటంలోనూ ఒక అగ్రగామి విశ్వవిద్యాలయంగా వెలుగొందాలని తన ఆకాంక్షను వ్యక్తం చేశారు.

# కాలువలు పూడిక మట్టి వినియోగంపై కమిటీలు

### ప్రభుత్వ స్థలాల వినియోగానికి పూడిక మట్టి కేటాయింపు –జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్



**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 27**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా లో పంట కాలువలు మూసివేసిన పిదప చేపట్టే పూడిక తీత పనుల మట్టిని ప్రభుత్వ పాఠశాలు,బరియల్ గ్రౌండ్స్ పల్లపు ప్రాంతాలలో వినియోగించుకునేందుకు మండలాల వారీగా జలవనరులు జిల్లా పంచాయతీ గనుల శాఖ, డిప్యూటీ ఎంపీడీవో డ్వామా సిబ్బందితో కమిటీలు వేయాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆదేశించారు,సోమవారం స్థానిక కలెక్టరేట్ నందు జల వనరులు డిపిఓ,గనులు డ్వామా సిబ్బందితో క్లోజర్ సమయంలో పూడిక తీత పనుల ద్వారా సమీకరించిన మట్టి వినియోగంపై సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజోలు నియోజక వర్గం చేపట్టే కాలువ పూడికతీత పనులకు సంబంధించి రాజోలు శాస నసభ్యులు దేవ వరప్రసాద్ ప్రతిపాదించారన్నారు.ప్రోక్లైనర్ ద్వారా సేకరించిన పూడిక మట్టిని వినియోగంపై కమిటీలను నియమించడం జరిగిందన్నారు.ఈ కమిటీలు ఆ మండలాల పరిధిలో ప్రభుత్వ పరంగా పల్లపు ప్రాంతాలను ఎత్తు విధంగా ప్రభుత్వ పాఠశాలలో గ్రౌండ్ లెవెలింగ్ ఆరోగ్య కేంద్రాలు బరియల్ గ్రౌండ్స్ వాటికి ఈ పూడిక మట్టిని కేటాయించాలని ఆయన ఆదేశించారు.ఈ కమిటీలు ప్రభుత్వపరంగా అత్యవ సరమైన పనులకు మాత్రమే ఈ కేటాయింపులు చేస్తూ పూర్తిగా సహకరించాలని ఆయన సూచించారు.ఈ సమావేశంలో జల వనరుల శాఖ ఈ.ఈ. వెంకటేశ్వరరావు, గనుల శాఖ ఏడి అశోక కుమార్, డ్వామా పిడి: డి. రాంబాబు, జిల్లా పంచాయతీ అధికారి శాంత లక్ష్మి డ్రైనేజీ విభాగం ఈ.ఈ ,ఎం.వి. కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## మొదటి పేజీ తరువాయి

# ఇప్పుడు వెళ్తున్నా.. ఆరోజు మళ్లీ తిరిగొస్తా

వ్యాఖ్యలు చేశారు. రాజకీయాల్లోకి ప్రవేశించి.. భాజపాలో చేరిన తర్వాత ఓ కార్యకర్తగా పార్టీ ఏది చేయమన్నా చేశానని ప్రధాని వెల్లడించారు. ఎన్నికల బాధ్యతలు స్వీకరించడం కూడా ఇందులో భాగమేనని అన్నారు. తనకు ప్రత్యేకంగా ఓ కుటుంబం అంటూ ఏదీ లేదని.. దేశ ప్రజలే తన కుటుంబమని పేర్కొన్నారు. గత నాలుగు దశాబ్దాలుగా తాను దేశంలోని ప్రతి ప్రాంతంలో పర్యటిస్తున్నానని..ఈ రోడ్‌షోలే తనకు పుణ్యయాత్రలని వ్యాఖ్యానించారు. వారు అధికారంలోకి రావడానికి కారణమైన "మా–మాటి–మనుష్" (తల్లి–దేశం–ప్రజలు) నినాదాన్నే టీఎంసీ నేతలు విడిచిపెట్టారని ప్రధాని ఆరోపించారు. ఎన్నికల ప్రచార సమయంలో వారు ఒక్కసారి కూడా ఈ నినాదాన్ని ప్రస్తావించకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఆ పార్టీ నేతలు రాష్ట్ర అభివృద్ధిని పక్కనపెట్టి దూషణలు, బెదిరింపు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. టీఎంసీ పాలనలో మహిళలపై మునుపెన్నడూ లేని స్థాయిలో దాడులు జరుగుతున్నాయని, నేరస్థులు స్వేచ్ఛగా తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే నిందితులను కఠినంగా శిక్షిస్తామన్నారు.

# ఒకటికి నాలుగు.. మా లెక్క వేరేలే..

ఆస్తులను ధ్వంసం చేస్తామని పేర్కొన్నారు. ఆదివారం ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ.. కాల్పుల విరమణ ఒప్పందానికి ఇరాన్ అంగీకరించకపోతే.. టెహ్రాన్‌లోని చమురు పైప్‌లైన్‌లను పేల్చేస్తామని హెచ్చరించారు. ప్రధాన ఆర్థిక వనరు అయిన చమురును నాశనం చేస్తే.. ఆ దేశం తప్పకుండా తమ మాట వింటుందన్నారు. చర్చల కోసం తమ బృందాన్ని పాక్‌కు వెళ్లొద్దని ఆదేశించారు. యుద్ధం ముగిసిపోవాలనుకుంటే ఇరాన్ నేతలే తమను సంప్రదిస్తారని అన్నారు. మరోవైపు అమెరికాతో ప్రత్యక్ష చర్చలు జరిపేందుకు ఇరాన్ (×తీ్ఖుఅ) ప్రతినిధి బృందం కూడా సుముఖత వ్యక్తం చేయలేదు. తమ డిమాండ్ల జాబితాను పాక్ అధికారులకు అందజేసి.. ఇస్లామాబాద్ నుంచి వెళ్లిపోయింది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ త్వరలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సమావేశం కానున్నట్లు తెలుస్తోంది.

# నాలాంటి వాళ్లకు ఇదొక ఎమోషన్

గర్వంగా ఉంది. 2014లో రాష్ట్రం విడిపోయినప్పుడు రాజధాని, సచివాలయం, కనీసం కూర్చోవడానికి కుర్చీ కూడా లేని నిస్సహాయ స్థితిలో ఉన్నాం. కట్టుబట్టలతో మనల్ని బయటకు గెంటేశారు. ఆనాడు మనకున్నవి రెండే ఆస్తులు. ఒకటి ఆంధ్రా యూనివర్సిటీ, రెండు మన బ్రాండ్ సీబీఎన్. రాష్ట్ర విభజన తర్వాత మొదటి కేబినెట్ సమావేశం పెట్టుకోవడానికి కూడా చోటులేని పరిస్థితుల్లో ఏయూనే మాకు ఆశ్రయమిచ్చింది. 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పుడు తొలి అసెంబ్లీ సమావేశాలు కూడా ఇక్కడే జరిగాయి. ఇది ఏయూ చరిత్రలో మరువలేని ఘట్టం" అని గుర్తుచేశారు.

**భవిష్యత్ లక్ష్యాలపై స్పష్టమైన ప్రకటన..:** విద్యార్థులను ఉద్దేశించి లోకేష్ మాట్లాడుతూ.. "నేను స్టాన్‌ఫోర్డ్, కార్నెగీ మెలన్ వంటి విశ్వవిద్యాలయాల్లో చదివినప్పటికీ, ఈరోజు మిమ్మల్ని చూసి అసూయ పడుతున్నాను. ఏయూలో చదివి ఉంటే బాగుండేదనిపిస్తోంది. మీ జోష్ చూశాక మీ కోసం మరింత కష్టపడాలనే తపన పెరుగుతోంది" అని అన్నారు. ఎంతోమంది మహానుభావుల త్యాగాలతో, దార్శనికుల కృషితో ఏయూ ఉన్నత శిఖరాలను అధిరోహించిందని, సీఆర్ రెడ్డి, సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి వారి సేవలను కొనియాడారు. ప్రస్తుతం ఏయూ.. రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో 4వ స్థానంలో ఉందని, అయితే ఇది తనకు సంతృప్తినివ్వడం లేదని స్పష్టం చేశారు. "ఆంధ్ర విశ్వవిద్యాలయం దేశంలోనే ఓవరాల్ ర్యాంకింగ్స్‌లో మూడో స్థానం, ప్రపంచ ర్యాంకింగ్స్‌లో టాప్ 100లో నిలిచినప్పుడే విద్యాశాఖ మంత్రిగా నాకు సంతృప్తి. ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్ కృషి చేయాలి" అని దిశానిర్దేశం చేశారు.

**అమీర్ పేటలో నాలుగు నెలలు చాలు!..:** పరిశ్రమలకు, విద్యకు మధ్య ఉన్న అంతరాన్ని (స్కిల్ గ్యాప్) తొలగించాల్సిన అవసరం ఉందని లోకేష్ నొక్కి చెప్పారు. "నాలుగేళ్ల ఇంజనీరింగ్ చేసినా ఉద్యోగం సంపాదించలేని పరిస్థితి ఉండగా, అమీర్‌పేట్‌లో నాలుగు నెలల కోర్సుతో జాబ్ కొడుతున్నారు. ఈ స్కిల్ గ్యాప్‌కు ఫుల్‌స్టాప్ పెట్టేందుకు పరిశ్రమలతో అనుసంధానం తప్పనిసరి. విద్యార్థులు ఏడాది పాటు ఫీల్డ్‌లో పనిచేసేలా విధానాలు తీసుకొస్తాం" అని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఏడాదిలోగా యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను యుద్ధప్రాతిపదికన భర్తీ చేస్తామని ప్రకటించారు. ఈ వేడుకల్లో గవర్నర్ అబ్దుల్ నజీర్, మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు, భారతరత్న సచిన్ టెండూల్కర్, కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాసవర్మ, సినీ దర్శకులు త్రివిక్రమ్ శ్రీనివాస్, పారిశ్రామికవేత్తలు గ్రంథి మల్లికార్జునరావు, బీవీఆర్ మోహన్ రెడ్డి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# బీజేపీలో ఆప్ ఎంపీల విలీనానికి రాజ్యసభ ఆమోదం

ఏడుగురు ఎంపీలు ఎంతో క్రమశిక్షణ కలిగిన వారని, పార్లమెంటరీ నిబంధనలకు లోబడి పనిచేసే వారంటూ కిరణ్ రిజిజు కొనియాడారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని వారిని ఆహ్వానించిన మంత్రి, ఇదే సమయంలో విపక్షాల 'ఇండి' కూటమిపై విరుచుకుపడ్డారు. తుక్డే–తుక్డే ఇండి అలయన్స్‌కు గుడ్ బై చెప్పే సమయం వచ్చింది అంటూ రిజిజు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి.

## కామెడీ పేరిట విద్వేషం సృష్టిస్తే ఊరుకోము : పల్లా శ్రీనివాస్ రావు



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :27**

బెంగళూరులో స్టాండప్ కమెడియన్ శరత్ ఉదయ్ షో సందర్భంగా చోటుచేసుకున్న ఘటనను తెలుగుదేశం పార్టీ తీవ్రంగా ఖండించింది. ఈ ఘటనపై స్పందించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ రావు, ఏదైనా అంశంపై అభ్యంతరాలు ఉంటే చట్టబద్ధమైన మార్గాల్లోనే స్పందించాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఒక్కరికీ అభిప్రాయ స్వేచ్ఛ ఉన్నప్పటికీ, దానిని బాధ్యతాయుతంగా వినియోగించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం సమంజసం కాదని స్పష్టం చేశారు. కార్యకర్తలు ఆవేశానికి లోనవకుండా క్రమశిక్షణతో వ్యవహరించాలని సూచించారు. తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణకు ప్రతీక అని పేర్కొంటూ, పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధంగా ప్రవర్తించవద్దని క్యాడర్‌ను హెచ్చరించారు. వివాదాస్పద వ్యక్తుల ప్రలోభాలకు లోనై పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించవద్దని సూచించారు. ఇటీవల కొందరు స్టాండప్ కమెడియన్లు చౌకబారు ప్రచారం కోసం సమాజ శ్రేయస్సును పణంగా పెడుతున్నారని విమర్శించారు. భావ ప్రకటన స్వేచ్ఛ పేరుతో రాజకీయ నేతలు, వ్యవస్థలను కించపరుస్తూ ఉద్రిక్తతలు సృష్టించడం బాధ్యతారాహిత్యంగా ఉందన్నారు. కామెడీ అనేది వినోదాన్ని పంచాలిగానీ, విద్వేషాన్ని ప్రేరేపించకూడదని అభిప్రాయపడ్డారు. ఇలాంటి చర్యలు కొనసాగితే, రాజ్యాంగం ప్రకారం చట్టపరమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. పద్ధతి తప్పేవారిపై చట్టం తన పని తాను చేసుకుంటుందని స్పష్టం చేశారు.

## పెట్టుబడుల హబ్‌గా విశాఖ ఎదుగుదల: గంటా



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :27**

పెట్టుబడులకు విశాఖపట్నం ప్రధాన గమ్యస్థానంగా అవతరిస్తోందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆనందపురం మండలం తర్లువాడలో ఏర్పాటు చేయనున్న గూగుల్ డేటా సెంటర్ శంకుస్థాపన ఏర్పాట్లను సోమవారం పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సుమారు 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి స్వతంత్ర భారతదేశంలో ఇప్పటివరకు వచ్చిన అతిపెద్ద విదేశీ పెట్టుబడులలో ఒకటిగా ఆయన అభివర్ణించారు. హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్ ఎలా గేమ్‌చేంజర్‌గా మారిందో, విశాఖకు గూగుల్ కూడా అదే విధంగా కీలక మార్పులు తీసుకురానుందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్‌కు మంత్రి లోకేష్ కార్యాచరణ జోడైతే గూగుల్ డేటా సెంటర్ వంటి ప్రాజెక్టులు సాధ్యమవుతాయని అన్నారు. గత 21 నెలల్లో విశాఖకు వచ్చిన ఐటీ కంపెనీలు ప్రభుత్వ చిత్తశుద్ధిని ప్రతిబింబిస్తున్నాయని వ్యాఖ్యానించారు. టీసీఎస్, కాగ్నిజెంట్, రహేజా, బ్రూక్‌ఫీల్డ్, రిలయన్స్ వంటి ప్రముఖ సంస్థలు విశాఖలో పెట్టుబడులు పెట్టడం వల్ల నగర అభివృద్ధి దిశలో పెద్ద మార్పు వస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఒకప్పుడు మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లోనే అధికంగా పెట్టుబడులు కేంద్రీకృతమయ్యేవని, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ పెట్టుబడుల ఆకర్షణలో ముందంజలో ఉందని పేర్కొన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి రానున్న నేపథ్యంలో విశాఖ అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని తెలిపారు. ఇంతటి చారిత్రక ప్రాజెక్టులో భాగస్వామి కావడం సంతోషకరమని అన్నారు. పరిశ్రమల స్థాపనతో పాటు భూములు ఇచ్చిన రైతులు కూడా సంతృప్తిగా ఉండాలని ముఖ్యమంత్రి సూచనల మేరకు, వారికి తగిన పరిహారం చెల్లించినట్లు తెలిపారు. శంకుస్థాపన అనంతరం రైతులతో సమావేశమై మిగిలిన సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## స్వయం సహాయక సంఘాల గోడ పత్రిక ఆవిష్కరించిన కలెక్టర్ మహేష్ కుమార్

**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 27**

స్వయం సహాయక సంఘా లు పెన్షనర్లకు సంబంధించి న సమస్యలు లేదా ఫిర్యాదులు ఉన్నచో డిఆర్ డి ఏ సర్ప్ కాల్ సెంటర్కు ఫోన్ చేసి పరిష్కార మార్గాలు పొందవచ్చునని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ నందు కాల్ సెంటర్ ప్రచార గోడప త్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8978881621 సెల్ నెంబర్ కు ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 5 న్నర గంటల వరకు పని దినాలలో ఫిర్యాదు చేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి ,టి. రాంబాబు, డిపిఓ శాంత లక్ష్మి, డిపిఎం అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

# సరఫరా లోటు లేదని కేంద్రం... రాష్ట్రంలో మాత్రం సంక్షోభం : వైసీపీ విమర్శలు

**విశాఖ సిటీ, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :27**

రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత తీవ్రంగా మారుతున్న నేపథ్యంలో, దీనిపై విశాఖపట్నం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కె.కె. రాజు తీవ్ర విమర్శలు చేశారు. సిరిపురం ప్రాంతంలోని ఒక పెట్రోల్ బంక్‌ను పార్టీ నాయకులతో కలిసి సందర్శించిన ఆయన, అక్కడి పరిస్థితులను పరిశీలించి వినియోగదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేని విధంగా కేవలం ఆంధ్రప్రదేశ్‌లోనే ఇంధన సంక్షోభం నెలకొనడం ఆందోళనకరమని అన్నారు. గత మూడు రోజులుగా పరిస్థితి మరింత విషమించిందని, అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించడంలో విఫలమైందని విమర్శించారు. కేంద్ర పెట్రోలియం మరియు సహజ వాయువు శాఖ మంత్రి మాత్రం దేశవ్యాప్తంగా ఎటువంటి సరఫరా లోటు లేదని, ఇండెంట్‌లు కూడా పెండింగ్‌లో లేవని స్పష్టం చేసిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. అలాంటప్పుడు రాష్ట్రంలో కొరత ఎలా ఏర్పడిందని ప్రశ్నించారు. డీలర్లు ఉద్దేశపూర్వకంగా స్టాక్ నిల్వ చేసుకుంటున్నారని, ధరలు పెరిగే అవకాశం ఉందన్న ప్రచారంతో సరఫరాను నిలిపివేస్తున్నారని ఆరోపించారు. ఈ పరిస్థితిపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని, సమీక్షలు నిర్వహించకుండా కేవలం లేఖలకే



పరిమితమవుతోందని విమర్శించారు. రాష్ట్రంలో మొత్తం 4,510 పెట్రోల్ బంకులు ఉండగా, వాటిలో సుమారు 70 శాతం బంకులలో “నో



స్టాక్” బోర్డులు కనిపిస్తున్నాయని తెలిపారు. అయితే పొరుగు రాష్ట్రాలు అయిన తమిళనాడు, కర్నాటక, తెలంగాణలో ఎక్కడా ఇలాంటి సమస్యలు లేవని పేర్కొన్నారు. ఈ పరిస్థితులు రాష్ట్ర ప్రభుత్వం మరియు డీలర్ల మధ్య కుమ్మక్కు ఉన్నాయన్న అనుమానాలకు తావిస్తున్నాయని, రాష్ట్రంలో కృత్రిమ కొరత సృష్టించబడుతోందని కె.కె. రాజు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సమన్వయకర్తలు, నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పెట్రోల్ బంక్‌లపై ప్రత్యేక తనిఖీలు కొనసాగింపు

## కలెక్టర్ విజయ్ కృష్ణన్



**అనకాపల్లి, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :27**

అనకాపల్లి జిల్లాలో పెట్రోల్, డీజిల్ సరఫరా సమృద్ధిగా ఉందని, ఎటువంటి కొరత లేదని జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా సంయుక్తంగా తెలిపారు. జిల్లా యంత్రాంగం మరియు పోలీసు శాఖ సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ (సివిల్ సప్లైస్) మరియు పోలీసు విభాగాల ప్రత్యేక బృందాలు జిల్లావ్యాప్తంగా పెట్రోల్ బంక్‌లను నిరంతరం తనిఖీ చేస్తున్నాయి. బంక్‌లలో నిల్వలు, విక్రయ విధానం వంటి అంశాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. ఇంధనాన్ని ఉద్దేశపూర్వకంగా నిల్వ ఉంచడం, కృత్రిమ కొరత సృష్టించడం లేదా బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. అక్రమాలకు పాల్పడే బంక్ నిర్వాహకులపై లైసెన్సు రద్దుతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయబడతాయని స్పష్టం చేశారు. ఎస్‌హెచ్‌ఓలు, ఎస్‌డిపిఓలు తమ పరిధిలోని పెట్రోల్ బంక్‌ల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని, రెవెన్యూ సిబ్బందితో సమన్వయం కొనసాగించాలని ఎస్పీ ఆదేశించారు. సోషల్ మీడియాలో వ్యాప్తి చెందుతున్న అసత్య ప్రచారాలను నమ్మి ప్రజలు ఆందోళన చెందవద్దని విజ్ఞప్తి చేశారు. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే వారిపై సైబర్ క్రైమ్ విభాగం నిఘా ఉంచినట్లు తెలిపారు. జిల్లాలో ఇంధన సరఫరా వ్యవస్థ పూర్తిగా సాధారణ స్థితిలో ఉందని, ప్రజలు అవసరానికి మించి ఇంధనాన్ని నిల్వ చేసుకోవద్దని సూచించారు. పెట్రోల్ బంక్‌ల వద్ద ఇబ్బందులు ఎదురైనా లేదా బ్లాక్ మార్కెట్ విక్రయాలపై సమాచారం తెలిసినా వెంటనే డయల్ 100/112 కు ఫిర్యాదు చేయాలని కోరారు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచబడతాయని భరోసా ఇచ్చారు. జిల్లా యంత్రాంగం పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోందని, ప్రజలు పోలీసు మరియు రెవెన్యూ శాఖలకు సహకరించి శాంతిభద్రతలను కాపాడాలని అధికారులు కోరారు.

# FIR అంటే ఏమిటి...?

46

దేశంలో క్రిమినల్ న్యాయ వ్యవస్థలో కీలకమైన మార్పుల భాగంగా, ఎఫ్.ఐ.ఆర్ (ప్రథమ సమాచార నివేదిక) నమోదు ప్రక్రియకు సంబంధించి కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చాయి. ఇంతకుముందు సి.ఆర్.పి.సి సెక్షన్ 154 కింద ఉన్న ఈ ప్రక్రియను, ఇప్పుడు భారతీయ నాగరిక్ సురక్ష సంహిత బి.ఎన్.ఎస్.ఎస్ సెక్షన్ 2023 లోని సెక్షన్ 173 ద్వారా అమలు చేస్తున్నారు. గుర్తించదగిన నేరం గురించి పోలీసులకు సమాచారం అందిన వెంటనే, దాన్ని ఎఫ్.ఐ.ఆర్ రూపంలో నమోదు చేయడం చట్టపరంగా తప్పనిసరి. ఎఫ్.ఐ.ఆర్ నమోదు అనంతరం, పోలీసులు దర్యాప్తు ప్రారంభించాల్సిందే. ఈ నిబంధన ద్వారా బాధితులకు తక్షణ న్యాయం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం మార్పులు చేసింది. బి.ఎన్.ఎస్.ఎస్ సెక్షన్ 173 ప్రకారం, ఫిర్యాదు మౌఖికంగా లేదా వ్రాతపూర్వకంగా ఇవ్వవచ్చు. మౌఖిక ఫిర్యాదును పోలీసులు వ్రాతపూర్వకంగా నమోదు చేసి, ఫిర్యాదుదారునితో ధృవీకరించాలి. ఎఫ్.ఐ.ఆర్ నమోదు ప్రక్రియలో పారదర్శకతను పెంచడం కోసం ఈ నిబంధనలు తీసుకొచ్చారు. ఈ చట్టంలో మహిళలు మరియు వికలాంగులకు ప్రత్యేక రక్షణలు కూడా కల్పించబడ్డాయి. మహిళలపై జరిగిన నేరాల సందర్భంలో, మహిళా పోలీసు అధికారిణి ద్వారా ఫిర్యాదు స్వీకరించడం, అవసరమైతే బాధితురాలి ఇంటి వద్ద స్టేట్మెంట్ నమోదు చేయడం వంటి చర్యలు చేపట్టాలి. వికలాంగుల విషయంలో, వారికి అనుకూలంగా సహాయకులతో స్టేట్మెంట్ నమోదు చేసే అవకాశాన్ని కూడా కల్పించారు. అయితే, కొన్ని ప్రత్యేక కేసుల్లో ముఖ్యంగా 3 నుంచి 7 సంవత్సరాల జైలు శిక్షకు సంబంధించిన నేరాలలో ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయడానికి ముందు ప్రాథమిక విచారణ నిర్వహించే అవకాశం ఉంది. ఈ





విచారణ ద్వారా కేసు నిజానిజాలు నిర్ధారించబడతాయి. పోలీసులు ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయడానికి నిరాకరిస్తే, బాధితుడు నేరుగా మేజిస్ట్రేట్‌ను ఆశ్రయించి ప్రైవేట్ ఫిర్యాదు దాఖలు చేయవచ్చు. బి.ఎన్.ఎస్.ఎస్ సెక్షన్ 173(4) ప్రకారం, మేజిస్ట్రేట్ కేసు నమోదు చేయమని లేదా విచారణ జరపమని ఆదేశించే అధికారం కలిగి ఉంటారు. మొత్తానికి, బి.ఎన్.ఎస్.ఎస్ సెక్షన్ 173 ద్వారా ఎఫ్.ఐ.ఆర్ నమోదు విధానం మరింత స్పష్టంగా, బాధితులకు అనుకూలంగా మారింది. న్యాయం త్వరగా అందేలా, పోలీసుల బాధ్యతలను కచ్చితంగా నిర్వచించేలా ఈ కొత్త చట్టం కీలక పాత్ర పోషిస్తోంది.

**జె. కనక దుర్గ లక్ష్మీ**
**ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్, (IHR)**
**ఉత్తరాంధ్ర ఇంచార్జి**

## అయిదు అడుగులు పెరిగిన స్థంభం తోటకూర మొక్క

- అంతరించి పోతున్న విత్తనం మళ్ళీ దొరికింది
- మన దేశీయ విత్తన సంపత్తిని కాపాడుకోవాలి
- జెవి రత్నం వ్యవస్థాపక కార్యదర్శి గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ

**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 27**



అయిదు అడుగులు పెరిగిన స్థంభం తోటకూర మొక్క అందరినీ ఆకట్టుకుందని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి, మన కూరగాయల తోట వ్యవస్థాపకులు జెవి రత్నం అన్నారు. సోమవారం ఎంవిపి కాలనీలో తమ ఇంటి వద్ద పెరిగిన ఎరుపు రంగు స్థంభం తోటకూర మొక్క ను పరిచయం చేశారు. తాము సేకరించిన దేశీయ విత్తనాలు ఏ విధంగా పుట్టి పెరిగడం నిరంతరం పరిశీలిస్తున్నామన్నారు. అలాగే ఈ విత్తనాలు వేయగా అది పొదవునగా పెరగడం చూసి విత్తనాలు కోసం దాచి పెట్టామన్నారు. ఈ తోటకూర గురించి వినడమే కానీ మొదటి సారి తమ ఇంటి వద్ద పెరిగింది అని అన్నారు. వాస్తవానికి ఆకుపచ్చ రంగులో లైట్, డార్క్ రంగుల్లో ఉండే స్థంభం తోటకూర విత్తనాల లభ్యత ఉన్నప్పటికీ ఈ ఎరుపు రంగు స్థంభం తోటకూర అనుకోకుండా లభ్యం అయింది అని అన్నారు. ఈ అంతరించి పోతున్న విత్తనం మళ్ళీ దొరికినందుకు సంతోషంగా ఉంది అన్నారు. మన దేశీయ విత్తన సంపత్తిని మనమే కాపాడుకోవాలి అని కోరారు.

## ప్రజల సందర్శనకు ఏయూ హెరిటేజ్-లెగసి ఫోటో ఎగ్జిబిషన్

- రెండు రోజుల నగరవాసులకు అవకాశం



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 27**

ఆంధ్రవిశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలలో భాగంగా విశ్వవిద్యాలయ చరిత్ర, చారిత్రక సంఘటనలను తెలిపే విధంగా ఏర్పాటు చేసిన ఏయూ హెరిటేజ్-లెగసి ఫోటో ఎగ్జిబిషన్‌ను రెండు రోజుల పాటు నగరవాసుల సందర్శనార్థం అనుమతిస్తున్నట్లు ఏయూ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఏయూ చారిత్రక వారసత్వం, ఘనమైన వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు చాటే విధంగా ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశారు. 1926 నుంచి నేటి వరకు విశ్వవిద్యాలయంలో జరిగిన ప్రముఖ కార్యక్రమాలు, సందర్శించిన ప్రముఖులు, ప్రముఖ సంఘటనలను నేటి తరానికి చాటే విధంగా ఈ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ఏయూ చిత్రకళా విభాగం విద్యార్థులు తయారు చేసిన అనేక శిల్పాలను సైతం ఇక్కడ ప్రదర్శనలో ఉంచారు. మంగళ, బుధ వారాలలో నగరవాసులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ ప్రదర్శనను తిలకించవచ్చునన్నారు. ముఖ్యంగా కళాశాలల విద్యార్థులు, పాఠశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఏయూ అధికారులు సూచించారు.

# ఎబిఎన్ రాధాకృష్ణపై చర్యలు కోరుతూ కమిషనర్‌ను ఆశ్రయించిన వైసీపీ నాయకులు




**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :27**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణల నేపథ్యంలో ఎబిఎన్ ఆంధ్రజ్యోతి వ్యవస్థాపకుడు రాధాకృష్ణ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పార్టీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 9వ తేదీన ప్రసారమైన కార్యక్రమంలో పార్టీ నాయకులపై అవమానకర వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ, సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని అసంతృప్తి వ్యక్తం చేసిన నాయకులు, ఈ విషయాన్ని మరింత తీవ్రంగా తీసుకుని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో విశాఖపట్నం జిల్లా పార్టీ అధ్యక్షుడు కె.కె రాజు ఆధ్వర్యంలో పోలీస్ కమిషనర్‌కు మరోసారి ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని, ఏ పార్టీకి చెందిన వారైనా వ్యక్తిగతంగా లేదా రాజకీయంగా అవమానించే విధంగా వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలు ప్రజల్లో అపోహలు కలిగించడంతో పాటు సామాజిక సమతుల్యతను దెబ్బతీసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసులు వెంటనే స్పందించి, ఫిర్యాదుపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని పార్టీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్తలుగా వాసుపల్లి గణేష్ కుమార్, తిప్పల దేవన్ రెడ్డి, మొల్లి అప్పారావు, అలాగే సి.ఇ.సి సభ్యుడు కోలా గురువులు, మాజీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ పాల్గొన్నారు. అదేవిధంగా నియోజకవర్గ పరిశీలకులు రొంగలి జగన్నాథం, జహీర్ అహ్మద్, సతీష్ వర్మ, పేడాడ రమణికుమారితో పాటు రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

# విలువలతో కూడిన విద్యే విజయానికి మార్గం


## మాజీ రాజ్యసభ సభ్యులు సచిన్ టెండూల్కర్



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 27**

ప్రఖ్యాత క్రికెటర్, మాజీ రాజ్యసభ సభ్యులు, భారతరత్న సచిన్ టెండూల్కర్ ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది వేడుకల్లో పాల్గొని విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన తండ్రి సాధారణ కుటుంబ నేపథ్యం నుండి వచ్చి కష్టపడి చదువుకుని ప్రొఫెసర్‌గా, కవిగా ఎదిగారని తెలిపారు. పరిమిత సౌకర్యాల మధ్య కూడా ఉన్నత విద్యను అభ్యసించి గోల్డ్ మెడల్స్ సాధించడం తనకు ఆదర్శంగా నిలిచిందన్నారు. తన తండ్రి నుంచి ఓర్పు, క్రమశిక్షణ, విలువలు నేర్చుకున్నానని పేర్కొంటూ, చిన్ననాటి నుండి ప్రేమతో మార్గనిర్దేశం చేయడం తన వ్యక్తిత్వ వికాసానికి దోహదపడిందన్నారు. ప్రతీ ఒక్కరిలో ఉండే బాహ్య మరియు అంతర్గత ఒత్తిడులను గుర్తించి నియంత్రించుకోవడం అవసరమని అన్నారు. ఏకాగ్రతతో లక్ష్యంపై దృష్టి సారిస్తే విజయం సాధ్యమవుతుందని తెలిపారు. విజయం ఒక్కరోజులో సాధ్యం కాదని, కష్టపడి సాధించాల్సిందేనని సూచించారు. కలలను నెరవేర్చుకునే క్రమంలో ఎప్పుడూ అడ్డదారులు తొక్కకుండా, విలువలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దేశ అభివృద్ధికి మరియు భవిష్యత్ తరాల అభ్యున్నతికి యువత విలువలను పాటించడం అత్యంత అవసరమని ఆయన విద్యార్థులకు సందేశమిచ్చారు.

# శ్రీ పార్వతి భీమేశ్వరస్వాముల కల్యాణం...




**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ 27**

అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం సఖినేటిపల్లి సెంటర్లో ఉన్న శ్రీ పార్వతి భీమేశ్వరస్వాముల కల్యాణంను పూజ్యం విశ్వనాథ శర్మ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. శ్రీ పార్వతి భీమేశ్వరస్వాముల కల్యాణంను రుద్రరాజు వెంకట్రామా శ్రీ పద్మరాజు(దిలిప్ రాజు), హిమబిందు దంపతులచే జరిపించినారు. మాజీ ఎమ్మెల్సీ ఆర్ పద్మరాజు, అధిక సంఖ్యలో భక్తులు పాలోని కల్యాణం తిలకించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

# విద్యా రంగంలో విశిష్ట సేవలు అందించిన ఏయూ

## ఒడిషా రాష్ట్ర గవర్నర్ కంభంపాటి హరిబాబు




**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 27**

వందేళ్ల విద్యా ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా రంగంలో ఎన్నో విశిష్ట సేవలు అందించి సమాజానికి మేలుచేసిందని ఒడిషా రాష్ట్ర గవర్నర్ కంభంపాటి హరిబాబు పేర్కొన్నారు. ఏయూ శతాబ్ది వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం దేశానికి రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి వంటి అత్యున్నత పదవుల్లో సేవలందించిన మహనీయులను అందించిన గొప్ప విద్యాసంస్థగా నిలిచిందన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, ఎం.వెంకయ్య నాయుడు వంటి ప్రముఖులు ఈ విశ్వవిద్యాలయానికి గౌరవాన్ని తీసుకువచ్చారని పేర్కొన్నారు. జి.ఎం.సి. బాలయోగి, ఎర్రన్నాయుడు, పల్లంరాజు తదితరులు కూడా ఈ విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థులుగా ఉన్నత స్థానాలు అధిరోహించినట్లు తెలిపారు. విశ్వవిద్యాలయం స్థాపనలో కీలక పాత్ర పోషించిన సర్ సి.ఆర్.రెడ్డి మరియు అనంతరం పనిచేసిన ఉపకులపతులు, అధ్యాపకులు సంస్థ అభివృద్ధికి బలమైన పునాదులు వేశారని చెప్పారు. అనేక మంది అధ్యాపకులు దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో ఉపకులపతులుగా సేవలందించడం విశ్వవిద్యాలయ ప్రతిష్టను పెంచిందన్నారు. తమకు ఈ విశ్వవిద్యాలయంతో ప్రత్యేక అనుబంధం ఉందని, విద్యార్థిగా చేరి ఉపాధ్యాయుడిగా సేవ చేసే అవకాశం లభించిందని తెలిపారు. విద్యార్థి దశలో ప్రజాస్వామ్య విలువల కోసం పోరాడిన అనుభవాలు తమకు ధైర్యం, నిబద్ధతను నేర్పాయని పేర్కొన్నారు. శతాబ్ది ఉత్సవాల సందర్భంగా స్మారక గ్రంథాల విడుదల, అంతర్జాతీయ విద్యా సంస్థలతో ఒప్పందాలు, డిజిటల్ కార్యక్రమాల ప్రారంభం వంటి కార్యక్రమాలు నిర్వహించబడినట్లు తెలిపారు. విద్యార్థులు జ్ఞానం, సృజనాత్మకత, నైతిక విలువలతో సమాజానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. అధ్యాపకులు విద్యార్థుల్లో విలువలు, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. విశ్వవిద్యాలయం రెండవ శతాబ్దంలోకి అడుగుపెడుతున్న ఈ సందర్భంగా విద్య, పరిశోధన, ఆవిష్కరణ రంగాల్లో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

# పట్టణంలో పెట్రోల్ బంకులను ఆకస్మికంగా తనిఖీ చేసిన శాసనసభ్యులు



**చింతలపూడి (సిటిజన్ టైమ్స్) ఏప్రియల్ 27**

చింతలపూడి పట్టణంలో పెట్రోల్ బంకుల వద్ద ఏర్పడిన రద్దీని దృష్టిలో ఉంచుకొని శాసనసభ్యులు స్వయంగా పరిశీలించి, బంకు యాజమాన్యంతో మాట్లాడారు ఈ సందర్భంగా బంకుల వద్ద బారులు తీరిన వాహనదారులతో మాట్లాడిన ఆయన, డీజిల్ మరియు పెట్రోల్ కొరత ఉందనే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ఆసుపత్రులకు ఇతర అత్యవసరాలకు వెళ్లే వారికోసం ఆయా పెట్రోల్ బంకుల్లో తగిన స్థాయిలో డీజిల్, పెట్రోల్ నిల్వలు ఉండేలా వెంటనే చర్యలు తీసుకోవాలని యాజమాన్యానికి సూచించారు. వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సరఫరా నిరంతరం కొనసాగించాలన్నారు. ఇక వాహనదారులు కూడా అవసరానికి మించి పెట్రోల్ లేదా డీజిల్ నిల్వ చేసుకోవద్దని సూచిస్తూ, వేసవికాలం నేపథ్యంలో అధిక నిల్వలు అగ్ని ప్రమాదాలకు దారితీసే అవకాశముందని హెచ్చరించారు. కృత్రిమ కోరత సృష్టించే వారిపై, రిటైల్ గా బ్లాక్ మార్కెటింగ్ చేసే వారిపై చర్యలు తీసుకోవాలని రెవిన్యూ మరియుపోలీస్ శాఖ అధికారులను ఆదేశించారు.

# ఆంధ్ర విశ్వవిద్యాలయం అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

## శతాబ్ది వేడుకల్లో ఉప రాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 27**

వందేళ్ల చరిత్ర కలిగిన ఆంధ్ర విశ్వవిద్యాలయం అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని భారత ఉప రాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ ఆకాంక్షించారు. సోమవారం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జరిగిన శతాబ్ది వేడుకల ముగింపు ఉత్సవాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి మాట్లాడుతూ గురువులందరికీ నా వందనాలని, వారి మార్గదర్శకత్వం వల్లనే నేను ఈ స్థాయికి ఎదిగానని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం తనకు బలమైన పునాదిని అందించిందని తెలిపారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం అభివృద్ధికి తోడ్పడిన మహానుభావులను స్మరించుకున్నారు. సి.ఆర్. రెడ్డి గారి దార్శనికత, సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి మార్గదర్శకత్వం, నాయకత్వం విశ్వవిద్యాలయాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లాయని కొనియాడారు. అలాగే జైపూర్ మహారాజు విక్రమ్ దేవ్ వర్మ, విజయనగరం మహారాజులు, బొబ్బిలి మరియు ఇతర సంస్థానాల సహకారాన్ని గుర్తుచేశారు. విద్యార్థులకు మార్గనిర్దేశం చేస్తూ, కేవలం డిగ్రీలు సాధించడం సరిపోదని, కాలానికి అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. విశ్వవిద్యాలయం బోధనా కేంద్రంతో పాటు పరిశోధనా కేంద్రంగా మారాలని, పరిశోధనలు క్షేత్రస్థాయి అవసరాలకు అనుగుణంగా ఉండాలని ఆకాంక్షించారు. పేటెంట్లపై అవగాహన పెంపొందించుకోవాలని, ప్యూర్ సైన్సెస్‌పై ఆసక్తి పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనేందుకు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నేతృత్వంలో, కేంద్ర ప్రభుత్వ మద్దతుతో ఆంధ్రప్రదేశ్ స్పష్టమైన లక్ష్యాలతో ముందుకు సాగుతోందని అన్నారు. 2025-26 నాటికి దేశంలోనే అత్యధిక పెట్టుబడులను ఆకర్షించిన రాష్ట్రంగా ఏపీ నిలిచిందని, ఈ అభివృద్ధిలో ఆంధ్ర విశ్వవిద్యాలయం వంటి విద్యాసంస్థల కృషి ఎంతో ఉందని పేర్కొన్నారు. విశాఖపట్నం నగరం ఐటీ, డేటా సెంటర్లు, టూరిజం మరియు గ్లోబల్ డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు ప్రధాన కేంద్రంగా మారుతోందన్నారు. గూగుల్ ఏఐ,అదానీ డేటా సెంటర్లు వంటి భారీ పెట్టుబడులతో విశాఖ ఒక శక్తివంతమైన ఎకనామిక్ హబ్‌గా అవతరిస్తోందని తెలిపారు. వైఫల్యాలకు కుంగిపోకుండా, క్రమశిక్షణతో లక్ష్యం వైపు సాగాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. సచిన్ టెండూల్కర్ తన 100వ సెంచరీ కోసం ఎదురుచూసిన పద్ధతిని ఉదాహరణగా చూపుతూ, ఓపిక మరియు ఆత్మవిశ్వాసం విజయానికి మూలసూత్రాలని వివరించారు. సమయపాలన అనేది కేవలం పాఠశాల విద్యార్థులకే కాకుండా, జీవితంలో ప్రతి ఒక్కరికీ అవసరమని, సమయాన్ని సరిగ్గా నిర్వహించే వారే విజేతలుగా నిలుస్తారని ఉద్ఘాటించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇప్పటికే పలు అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలతో ఒప్పందాలు (వీశీఖం) కుదుర్చుకుందని, రానున్న రోజుల్లో ఇది కేవలం జాతీయ స్థాయిలోనే కాకుండా, ప్రపంచంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాల జాబితాలో చేరుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అనంతరం రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ తో కలిసి మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు, ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, జిఎంఆర్ సంస్థ ఫౌండర్, చైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు, బి.వి.ఆర్.మోహన్ రెడ్డి, సత్యనారాయణ, ప్రొఫెసర్ ఎం.ఆర్.మాధవ్, త్రివిక్రమ్ శ్రీనివాస్ లకు ఎక్స్ లెన్సీ అవార్డుతో పాటు శతాబ్ది వేడుకల జ్ఞాపికలను అందజేశారు.

# స్వయం సహాయక సంఘాల గోడ పత్రిక ఆవిష్కరించిన కలెక్టర్ మహేష్ కుమార్



**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 27**

స్వయం సహాయక సంఘా లు పెన్షనర్లకు సంబంధించి న సమస్యలు లేదా ఫిర్యాదులు ఉన్నచో డిఆర్ డి ఏ సర్ప్ కాల్ సెంటర్కు ఫోన్ చేసి పరిష్కార మార్గాలు పొందవచ్చునని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ నందు కాల్ సెంటర్ ప్రచార గోడప త్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8978881621 సెల్ నెంబర్ కు ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 5 న్నర గంటల వరకు పని దినాలలో ఫిర్యాదు చేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి ,టి. రాంబాబు, డిపిఓ శాంత లక్ష్మి, డిపిఎం అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టరేట్‌లో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

## జనసేన ఎంపీటీసీ మోటూరి దంపతులను అభినందించిన జిల్లా కలెక్టర్ ఎస్పీ

**అమలాపురం, సిటిజన్ టైమ్స్ ఏప్రియల్ 27**

సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో చిందాడగరువు బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా జనసేన సీనియర్ వీరమహిళ ఎంపిటిసి మోటూరి కనకదుర్గ వెంకటేశ్వరరావు ధన సహాయంతో మజ్జిగ చలివేంద్రశీ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్, జిల్లా ఎస్పీ రాహుల్ మీన, జాయింట్ కలెక్టర్ ,అడిషనల్ ఎస్పీ, ఏవో కాశి విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొని చలివేంద్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇలాంటి చలివేంద్ర కార్యక్రమాలు అమలాపురం పట్టణంలో ప్రారంభించాలని వారు కోరారు.




# బిల్లు పాస్ అయ్యే వరకు పోరాటం ఆగదు

## మహిళా బిల్లును అడ్డుకోవడం దుర్మార్గం

## పార్లమెంట్‌లో మహిళా బిల్లును అడ్డుకున్న కాంగ్రెస్ కుట్రలపై ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ధ్వజం

**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 27**

మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకుని మహిళా లోకానికి కాంగ్రెస్ పార్టీ తీవ్ర అన్యాయం చేసిందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మండిపడ్డారు. సోమవారం అమలాపురం పట్టణంలో మహిళలు నిర్వహించిన భారీ ర్యాలీ మరియు జన ఆక్రోశ మహిళా సమ్మేళనం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ ర్యాలీ పట్టణంలోని మెట్ల రమణబాబు స్వగృహం నుండి ప్రారంభమై స్థానిక గడియార స్తంభం వరకు సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ మహిళల సంక్షేమాన్ని కోరుకోలేదని, పార్లమెంట్‌లో బిల్లును ఓడించడం ద్వారా వారి అసలు స్వరూపం బయటపడిందని విమర్శించారు. మహిళలకు తండ్రి ఆస్తిలో సమాన హక్కు కల్పించిన ఘనత స్వర్గీయ నందమూరి తారక రామారావు కే దక్కుతుందని ఆయన గుర్తుచేశారు. స్థానిక సంస్థల్లో మహిళలకు మొదట 33 శాతం, ఆ తర్వాత 50 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీదని, ఇది నారా చంద్రబాబు నాయుడు దార్శనికతకు నిదర్శనమని కొనియాడారు.




డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, వారిలో ఆత్మవిశ్వాసం నింపిన గొప్ప నాయకుడు చంద్రబాబు ని ఆయన పేర్కొన్నారు. ప్రధాని మోదీ,చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ఎన్.డి.ఏ కూటమి మహిళలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. మహిళలకు చట్టసభల్లో 33 శాతం



రిజర్వేషన్లు దక్కే వరకు, మహిళా బిల్లు ఆమోదం పొందే వరకు ఈ పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో మరియు వీధిలో మహిళా బిల్లు ప్రాముఖ్యతను చాటిచెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది మహిళలు పాల్గొని, విపక్షాల తీరుకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు.

# పవన్ కల్యాణ్ ఆశయమే మార్గం

### - నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన జనసేన నాయకులు మచ్చా గంగాధర్ ( ఎంజీఆర్)



**కాకినాడ జిల్లా కాకినాడ ఏప్రిల్ 27 సిటిజన్ టైమ్స్**

జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ సేవా దృక్పథాన్ని, ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని కాకినాడలో జనసేన సీనియర్ నాయకులు మచ్చా గంగాధర్ మరోసారి తన ఉదారతను చాటుకున్నారు.కాకినాడ 25వ డివిజన్‌కు చెందిన స్వర్గస్తులైన కొత్తపల్లి బుల్లి సత్తియ్య కుటుంబ సభ్యులను మచ్చా గంగాధర్ స్వయంగా కలిసి పరామర్శించారు. వారి మృతి పట్ల ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ, ఆ కుటుంబానికి ధైర్యం చెప్పారు.నిత్యావసర వస్తువుల పంపిణీ: ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఆ కుటుంబానికి భరోసాగా నిలుస్తూ, సుమారు రెండు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులను అందజేశారు.కొనసాగుతున్న సేవా యజ్ఞం: రాజకీయాలంటే కేవలం అధికారం మాత్రమే కాదని, ఆపదలో ఉన్న వారికి అండగా ఉండటమేనని నమ్మే ఎందుకు , ఇప్పటివరకు మొత్తం 339 మందికి వివిధ రూపాల్లో ఆర్థిక సహాయం అందించి తన సేవా గుణాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా మచ్చా గంగాధర్ మాట్లాడుతూ మన నాయకుడు పవన్ కల్యాణ్ నేర్పిన సామాజిక బాధ్యతలో భాగంగానే ఈ కార్యక్రమాలు చేస్తున్నాం. కష్టాల్లో ఉన్న కార్యకర్తలకు, ప్రజలకు అండగా ఉండటం మన బాధ్యత. రాబోయే రోజుల్లో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంత రాయంగా కొనసాగుతాయి. ఈ కార్యక్రమంలో జనసేన వీర మహిళ 19 వార్డు ఇన్చార్జ్ బట్టు లీల, స్థానిక జనసేన నాయకులు, వీర మహిళలు, కార్యకర్తలు మరియు డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

44

ఇంధన కొరత పై సుంకర పావని తిరుమల కుమార్ ఆందోళన

**కాకినాడ (సిటిజన్ టైమ్స్ )ఏప్రిల్ 27**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు నగరాల్లో డీజిల్, పెట్రోల్ మరియు సి యన్ జి కొరత ఏర్పడటంపై కాకినాడ మాజీ మేయర్ మరియు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుంకర పావని తిరుమల కుమార్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ధరలు పెరుగుతాయనే సాకుతో కొందరు కృత్రిమ కొరత సృష్టించి ఇంధనాన్ని బ్లాక్ చేస్తున్నారనే వార్తలపై ఆమె మండిపడ్డారు. ప్రజలను భయాందోళనకు గురిచేస్తూ, నిత్యావసర రవాణాకు ఆటంకం కలిగిస్తున్న బాధ్యులపై విచారణ జరిపి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులను డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని, తక్షణమే పెట్రోల్, డీజిల్ మరియు సి యన్ జి సరఫరాను పునరుద్ధరించి ప్రజలకు ఊరట కలిగించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# జిల్లా కలెక్టరేట్ లో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

### జనసేన ఎంపీటీసీ మోటూరి దంపతులను అభినందించిన జిల్లా కలెక్టర్ ఎస్పీ





**అమలాపురం, సిటిజన్ టైమ్స్ ఏప్రియల్ 27**

సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో చిందాడగరువు బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా జనసేన సీనియర్ వీరమహిళ ఎంపిటిసి మోటూరి కనకదుర్గ వెంకటేశ్వరరావు ధన సహాయంతో మజ్జిగ చలివేంద్రశీ ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్, జిల్లా ఎస్పీ రాహుల్ మీన, జాయింట్ కలెక్టర్ ,అడిషనల్ ఎస్పీ, ఏవో కాశి విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొని చలివేంద్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇలాంటి చలివేంద్ర కార్యక్రమాలు అమలాపురం పట్టణంలో ప్రారంభించాలని వారు కోరారు.

## కాకినాడ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ను మర్యాదపురం కలిసిన ట్రైనీ కలెక్టర్ ప్రియా

**కాకినాడ సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 27**

కాకినాడ జిల్లా నూతన అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ కలెక్టర్) గా నియమితులైన ప్రియా సోమవారం కాకినాడ కలెక్టరేట్ లో జరుగుతున్న పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.




# బీసీల గురించి మాట్లాడే హక్కు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి లేదు



**అనంతపురం (సిటిజన్ టైమ్స్) ఏప్రియల్ 27**

అనంతపురం పట్టణంలోని నిన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీ గర్జన పై ఈరోజు అనంతపురం పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో మీడియా సమావేశం నిర్వహించిన లిహిందూపురం పార్లమెంట్ సభ్యులుబి కె పార్థసారధి మరియు రాయదుర్గం శాసనసభ్యులు కాలువ శ్రీనివాసులు మరియు అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ అనంతపురం వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ ఆదినారాయణ. హిందూపురం పార్లమెంట్ సభ్యులు బికే పార్థసారధి గారు మాట్లాడుతూ బీసీలకు గుర్తింపు ఇచ్చింది తెలుగుదేశం పార్టీయే ఆనాడు నందమూరి తారక రామారావు నుండి ఈనాడు చంద్రబాబు నాయుడు వరకు బీసీలకు తెలుగుదేశం పార్టీ సముచిత స్థానం కల్పించింది. మొట్టమొదటిసారిగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో 1999వ సంవత్సరంలో రెండు పార్లమెంట్ స్థానాలు బీసీలకు కేటాయించి బీసీలకు పెద్దపీట వేసింది తెలుగుదేశం పార్టీ యే అని పేర్కొన్నారు. అంతేకాకుండా ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఏ పార్టీ ఇవ్వని అసెంబ్లీ స్థానాలు బీసీలకు కేటాయించి బీసీలను గౌరవప్రదమైన స్థానంలో నిలిపింది తెలుగుదేశం పార్టీ యే ఈరోజు వైసిపి అధికారం కోల్పోయి మతిభ్రమించి మాట్లాడుతున్నారు. వైసీపీ నాయకులు పేరుకు బీసీ గర్జన అంటూనే బీసీల కోసం వారి అభ్యున్నతి కోసం పాటుపడిన మహా నాయకులు జ్యోతిరావు పూలే లాంటి మహానుభావుల చిత్రపటాలు పెట్టడానికి కూడా వాళ్లకు మనసు అంగీకరించలేదు ఇదేనా మీకు మీ పార్టీకి బీసీలపై ఉన్న ప్రేమ. మీరు బీసీలను ఓటు బ్యాంకుగా చూస్తున్నారు తప్ప వారికి మీరు చేసింది శూన్యం. 2014 నుండి 2019 వరకు బీసీల కోసం ఆదరణ పథకాన్ని తీసుకువచ్చి ఎంతోమందికి చేయూతనిచ్చింది తెలుగుదేశం పార్టీ. ఇప్పటికైనా బీసీలపై పక్షపాత వైఖరిని మీ పార్టీ విడాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# డీజిల్ కష్టాలు.. మూతపడుతున్న బంకులు..

# క్యూ కడుతున్న జనం..లబోదిబో మంటున్న రైతులు!

**ఆంధ్రప్రదేశ్ :( సిటిజన్ టైమ్స్ ) ఏప్రియల్ 27**

అంతర్జాతీయంగా ఇరాన్-అమెరికా మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో దాని ప్రభావం ఏపీలోని పెట్రోల్ బంకులపై స్పష్టంగా కనిపిస్తోంది. యుద్ధం వస్తే చమురు ధరలు పెరగడమే కాకుండా, సరఫరా నిలిచిపోతుందనే భయంతో ప్రజలు ఒక్కసారిగా బంకుల వద్ద బారులు తీరారు. భయంతో ముందస్తుగా కొనడం కారణంగా రాష్ట్రంలో ఇంధన కొరత ఏర్పడింది.

**ఏపీలో ప్రస్తుత పరిస్థితి:** గణాంకాలతో సహా..

ఏపీ రాష్ట్రంలో మొత్తం 4,510 పెట్రోల్ బంకులు ఉండగా, వాటిలో దాదాపు 421 బంకులు (సుమారు 10 శాతం) స్టాక్ లేక బోర్డులు తిప్పేయడం ఆందోళన కలిగిస్తోంది.

**పెరిగిన డిమాండ్:** సాధారణ రోజులతో పోలిస్తే పెట్రోల్, డీజిల్ వినియోగం ఒక్కసారిగా 50 శాతం పైగా పెరిగింది.

**అమ్మకాల వివరాలు:** సాధారణంగా రోజుకు 6,330 కిలో లీటర్ల పెట్రోల్ అమ్ముడవుతుండగా, శనివారం అది 10,345 కిలో లీటర్లకు చేరింది.

డీజిల్ విక్రయాలు కూడా 9,048 కిలో లీటర్ల నుండి ఏకంగా 14,156 కిలో లీటర్లకు పెరిగాయి. సరఫరా గతంలో కంటే 10 శాతం పెంచినప్పటికీ, వినియోగదారులు ట్యాంక్ ఫుల్ చేయించుకోవడమే




కాకుండా అదనపు నిల్వలకు ప్రయత్నిస్తుండటంతో బంకుల్లో నిల్వలు త్వరగా నిండుకుంటున్నాయి. సీఎం చంద్రబాబు సమీక్ష - కీలక ఆదేశాలు రాష్ట్రంలో నెలకొన్న ఈ అసాధారణ పరిస్థితిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అత్యున్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. అధికారుల నుంచి క్షేత్రస్థాయి నివేదికలను కోరారు.

**భయాలను తగ్గించే చర్యలు:** ఇంధన సరఫరాపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి, రద్దీని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే తీసుకున్న చర్యలు, ప్రస్తుత పురోగతిపై సాయంత్రంలోగా సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

# క్యాంపు కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమం



**దుగ్గిరాల ( సిటిజన్ టైమ్స్) ఏప్రిల్ 27:**

రైతులు మరియు పశువుల పెంపకందారుల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ స్పష్టం చేశారు. సోమవారం దుగ్గిరాలలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుండి వినతులు స్వీకరించారు. సత్వరమే వాటిని పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిసాన్ క్రెడిట్ కార్డు అమలుపై మాట్లాడుతూ "అర్హులైన ప్రతి రైతుకు, పశుపోషకునికి రూ. 2 లక్షల వరకు కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా రుణం అందేలా అధికారులు చొరవ చూపాలని ఆదేశించారు. ఈ రుణాల ద్వారా లభించే తక్కువ వడ్డీ ప్రయోజనాలను రైతులు సద్వినియోగం చేసుకునేలా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు.గ్రామాల్లో పశువుల పెంపకందారులకు, రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డు వల్ల కలిగే లాభాలను వివరించేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి అని సూచించారు. మంజూరైన రుణాలను వ్యవసాయం మరియు పశుపోషణ అభివృద్ధికి మాత్రమే వాడేలా రైతులకు మార్గదర్శకత్వం చేయాలనీ, తద్వారా వారికి మెరుగైన ఆర్థిక భరోసా లభిస్తుందని తెలిపారు. దరఖాస్తు ప్రక్రియలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా బ్యాంకర్లతో అధికారులు సమన్వయం చేసుకోవాలనీ దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సూచించారు.. గ్రీవెన్స్ కు విచ్చేసిన పలువురు బాధితుల సమస్యలను ఎమ్మెల్యే ఓపికగా విని, వాటిని సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజా సేవలో ఎక్కడా రాజీ పడబోమని, ప్రతి అర్జీదారునికి న్యాయం జరిగేలా చూస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు నియోజకవర్గ స్థాయి అధికారులు, కూటమి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## బడి పిలుస్తోందిలో అంగన్వాడీ కేంద్రాలుగా...






**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ 27**

అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలంలో బడి పిలుస్తోందిలో భాగంగా కేశవదాసు పాలెం యెనుముల వారి మెరక మోడల్ ప్రైమరీ స్కూల్ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలను సోమవారం ఎంఈవోలు డి.కిషోర్ కుమార్, ఎం. వెంకటేశ్వర రావు సందర్శించారు. అంగన్వాడీలో విద్య పూర్తి చేసుకున్న పిల్లలను నేరుగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని టీచర్లకు సూచించారు. విద్యార్థుల సంఖ్యను పెంచేలా కృషి చేయాలని టీచర్లకు ఆదేశించి, ఇంటింటికి తిరిగి ఎన్రోల్మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ప్రైవేటు పాఠశాలల విద్యార్థులను వయస్సు నిండిన వారిని పాఠశాలలో ప్రవేశానికి అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రజనీ కుమారి, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్స్, హెల్త్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టరేట్‌కి 195 అర్జీలు స్వీకారం

### జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్





**అమలాపురం సిటిజెన్ టైమ్స్ ఏప్రిల్ 27**

అర్జీలను నాణ్యతతో పాటు నిర్దేశిత సమయానికి పరిష్కార మార్గాలు చూపాలని పిజిఆర్ఎస్ లో అందిన అర్జీలను జవాబుదారీతనంతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ నందు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ మహేష్ కుమార్, ఆర్డిఓ జి మమ్మీ, డిఆర్ డిఎ పిడి రాంబాబు, ఎస్ డి సి: పి కృష్ణమూర్తి డిఎల్డిఓలు అర్జీ దాడుల నుండి సుమారుగా 195 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిజిఆర్ఎస్ ద్వారా అందుతున్న అర్జీల పరిష్కారంలో హేతుబద్ధత కలిగి ఉండాలని తెలిపారు. ప్రతి అర్జీని బాధ్యతగా తీసుకుని, నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు సకాలంలో సేవలు అందేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అర్జీలు పరిష్కార దిశగా పనిచేయడం అత్యంత ప్రధానమన్నారు .అర్జీల పట్ల సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన ర్యాపిడ్ సాండ్ ఫిల్టర్ ప్లాంట్ నిర్మాణ పనులు ప్రారంభం -ఎమ్మెల్యే దేవ..






**మలికిపురం సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ 27**

కోనసీమ జిల్లా, మలికిపురం మండలం గుడిమెళ్ళంకలో తాగునీటి పథకం పరిధిలో రూ. 5 కోట్ల విలువైన ఓ ఎన్ జి సి సి ఎస్ ఆర్ నిధులతో 6 ఏం ఎల్ డీ సామర్థ్యంతో నూతన ర్యాపిడ్ సాండ్ ఫిల్టర్ (ఆర్ ఎస్ ఎఫ్) ప్లాంట్ నిర్మాణ పనులను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ నేడు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవ మాట్లాడుతూ ఇటీవల ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ వర్చువల్ విధానంలో శంఖుస్థాపన చేసిన రూ.5 కోట్ల విలువైన ఓ ఎన్ జి సి సి ఎస్ ఆర్ నిధులతో 6 ఏం ఎల్ డీ సామర్థ్యంతో నూతన ర్యాపిడ్ సాండ్ ఫిల్టర్ (ఆర్ ఎస్ ఎఫ్) ప్లాంట్ నిర్మాణ పనులను ఈరోజు ప్రారంభించినట్లు తెలిపారు. కొబ్బరికాయ కొట్టి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలియజేశారు. ప్రస్తుతం ఈ పథకం ద్వారా మొత్తం 135 హాబిటేషన్లలో సుమారు 97 హాబిటేషన్లు, 29 గ్రామ పంచాయతీలకు తాగునీటి సరఫరా జరుగుతోందని, అంటే దాదాపు 50 శాతం గ్రామాలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నాయని ఎమ్మెల్యే దేవ తెలిపారు. అయితే పాత సాండ్ ఫిల్టర్లు ఆశించిన స్థాయిలో పనిచేయక పోవడం, ప్రస్తుత 5 ఏం ఎల్ డీ ర్యాపిడ్ సాండ్ ఫిల్టర్ పై అధికంగా ఆధారపడాల్సి రావడం వల్ల సరఫరాలో అంతరాయం కలిగే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. మంచినీరు సమస్యలను పరిష్కరించేందుకు 6 ఏం ఎల్ డీ సామర్థ్యంతో ఆధునిక ఫిల్టరేషన్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నామని, ఇది పూర్తయిన తర్వాత రోజువారీ నిరంతర తాగునీటి సరఫరా అందించగలమని చెప్పారు. ప్రస్తుతం అమలులో ఉన్న ఆల్టర్నేట్ డే సరఫరా విధానాన్ని మార్చి ప్రతి రోజు నీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. మొత్తం పనులను సుమారు 9 నెలల్లో పూర్తి చేసి, వచ్చే మార్చి నాటికి వినియోగంలోకి తీసుకురావాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఎమ్మెల్యే దేవ తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా మలికిపురం మండలంలోని గ్రామాలకు మెరుగైన, శుద్ధమైన తాగునీటి సరఫరా అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అర్డబ్ల్యూస్ అధికారులు, అమరజీవి జలధార వాటర్ గ్రిడ్ ప్రాజెక్ట్ అధికారులు, ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఏబీఎన్ రాధాకృష్ణపై చర్యలు కోరుతూ అడిషనల్ ఎస్పీకి ఫిర్యాదు



**పాలకొండ, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :27**

ఏబీఎన్ రాధాకృష్ణపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి సోమవారం పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ ఎం. వెంకటేశ్వర్లుకు వినతిపత్రం సమర్పించారు. ఈ నెల 9న పాలకొండ పోలీస్ స్టేషన్‌లో ఏబీఎన్ రాధాకృష్ణపై ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు పేర్కొన్నారు. దీంతో వెంటనే చట్టపరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వీరఘట్టం ఎంపీపీ దమలపాటి వెంకటరమణ నాయుడు, పాలకొండ వైస్ ఎంపీపీ కణపాక సూర్యప్రకాష్, జడ్పీటీసీ ప్రతినిధి సవర రాము, సవర చంద్రశేఖర్, సవర సాయి కుమార్, కందుల వెంకట నాయుడు, మిడితాన కళ్యాణి తదితరులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## గోమాతకు గౌరవం దక్కాలి

### గోవధ నిషేధ చట్టాన్ని పక్కాగా అమలు చేయాలి

**శేరిలింగంపల్లి, సిటీజన్ టైమ్స్, ఏప్రిల్ 27**

హైందవ సమాజం తల్లిగా భావించే గోమాతకు ప్రత్యేక గౌరవం దక్కాలని, దేశవ్యాప్తంగా గోవధ నిషేధ చట్టాన్ని ప్రభుత్వం కఠినంగా అమలు చేయాలని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం పీఠాధిపతులు విశ్వబ్రహ్మ శ్రీ వీరధర్మజ స్వామి మరియు బీరంగూడ గోశాల ప్రధాన కార్యదర్శి బోనకుర్తి విఠల్ డిమాండ్ చేశారు. గో సమ్మాన్ ఆహ్వాన అభియాన్' పిలుపులో భాగంగా సోమవారం శేరిలింగంపల్లి డిప్యూటీ కలెక్టర్ మహిపాల్ రెడ్డికి వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోవధకు, అక్రమ రవాణాకు పాల్పడే వారికి జీవిత ఖైదు వంటి కఠినమైన శిక్షలు అమలు చేయాలి. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, ఆవు పేడ, గోమూత్రం వినియోగంపై వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు జరగాలి. రైతులను గో ఆధారిత వ్యవసాయం వైపు ప్రోత్సహించాలి. ప్రభుత్వం గోశాలలకు ప్రత్యేక నిధులు కేటాయించడంతో పాటు, స్థానిక పరిశ్రమల నుండి నిధులు అందేలా చూడాలి. ప్రతి గ్రామంలో గోశాలను ఏర్పాటు చేసి, పశు గ్రాసం కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి తెలిపారు. ఈ కార్యక్రమంలో పతంజలి యోగ సమితి ప్రతినిధి పుట్ట వినయ్ గౌడ్, బీరంగూడ గోశాల రాజస్థానీ గేర్ మండలి సభ్యులు దీపక్, పరమేశ్వర్, ఓం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



## పెట్రోల్ డీజిల్ బంకులను పరిశీలించిన జిల్లా ఎస్పీ రాహుల్ మీన

**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 27**


డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ రాహుల్ మీనా సోమవారం పెట్రోల్, డీజిల్ బంకులను క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిస్థితులను పరిశీలించారు. జిల్లాలో ఇంధన కొరతపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అన్ని బంకుల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి, ట్యాంకర్ల రవాణాకు తగిన ఎస్కార్ట్ కల్పించడమైనదని తెలిపారు. రైతులు, ప్రజా రవాణా వాహనాలకు ప్రాధాన్యం ఇచ్చి ఇంధనం అందించేలా చర్యలు చేపట్టుచున్నారు. ప్రతి వాహనానికి పరిమితి మేరకే ఇంధనం నింపాలని బంకుల యజమానులకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. బ్లాక్ మార్కెటింగ్, కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బంకుల వద్ద ఎలాంటి గొడవలు జరగకుండా పోలీస్ బందోబస్తు,పోలీస్ అధికారులను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పెట్రోల్ బంకులను సిసి కెమెరాల పర్యవేక్షణలో ఉంచి ఇంధన లభ్యత ను, ఇంధన రవాణాను, బంకుల వద్ద పోలీస్ బందోబస్తు



ను జిల్లా నుంచి మానిటర్ చేస్తున్నామని,అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు 1 12కి లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.పౌరసరఫరాలు మరియు రెవిన్యూ అధికారులు సమన్వయంతో ఉంటూ ప్రజలకు పెట్రోల్ బంకుల వద్ద ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేయడమైనదని ఒక ప్రకటనలో తెలిపారు.

# పెట్రోల్ కోసం క్యూలు...

## ప్రభుత్వానికి సవాల్‌గా మారిన ఇంధన కొరత




**సిటిజన్ టైమ్స్ డెస్క్**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ కొరత తీవ్రంగా మారి ప్రజల దైనందిన జీవన విధానాన్ని దెబ్బతీస్తోంది. అనేక జిల్లాల్లో పెట్రోల్ బంకుల వద్ద “నో స్టాక్” బోర్డులు దర్శనమివ్వగా, వాహనదారులు గంటల తరబడి క్యూలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పట్టణాల నుంచి గ్రామాల వరకు ఇంధన లభ్యతలో అంతరాయం ఏర్పడడంతో రవాణా రంగం, వ్యాపార కార్యకలాపాలు ప్రభావితమవుతున్నాయి. డీజిల్ కొరత ప్రభావం సరుకు రవాణాపై స్పష్టంగా కనిపిస్తోంది. లారీలు నిలిచిపోవడం వల్ల వ్యవసాయ ఉత్పత్తులు, కూరగాయలు మార్కెట్లకు చేరడంలో ఆలస్యం జరుగుతోంది. దీని ఫలితంగా నిత్యావసర సరుకుల ధరలు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అత్యవసర సేవలు కూడా ఇంధన లభ్యతపై ఆధారపడటంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఈ పరిస్థితిపై ప్రభుత్వం మరియు ఆయిల్ మార్కెటింగ్ సంస్థలు “రాష్ట్రంలో ఎటువంటి ఇంధన కొరత లేదు, పానిక్ బాయింగ్ కారణంగా తాత్కాలిక సమస్య మాత్రమే” అని స్పష్టం చేస్తున్నాయి. అయితే నేలస్థాయిలో పరిస్థితులు మాత్రం భిన్నంగా ఉండటంతో ప్రజల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇంధన రంగ నిపుణులు ఈ అంశంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. వారి ప్రకారం, పానిక్ బాయింగ్ ఒక కారణం అయినప్పటికీ, సరఫరా వ్యవస్థలో ఉన్న లోపాలు ఈ సంక్షోభాన్ని మరింత తీవ్రమయ్యేలా చేశాయని అంటున్నారు. “డిమాండ్ ఒక్కసారిగా పెరగడం సహజమే అయినప్పటికీ, దానికి తగిన బఫర్ స్టాక్స్ లేకపోవడం, సరఫరా గొలుసులో సమన్వయం లోపించడం ప్రధాన కారణాలు” అని వారు పేర్కొంటున్నారు. సరఫరా వ్యవస్థలో ట్యాంకర్ల లభ్యత, డిపో స్థాయిలో ఆలస్యాలు, పంపిణీ లోపాలు వంటి అంశాలు ఇంధన అందుబాటును ప్రభావితం చేస్తున్నాయని సమాచారం. అదే సమయంలో, ప్రజలకు సరైన సమయంలో స్పష్టమైన సమాచారం అందించకపోవడం వల్ల పానిక్ బాయింగ్ పరిస్థితులు మరింత పెరిగాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. జిల్లా స్థాయిలో సరఫరా పర్యవేక్షణను కట్టుదిట్టం చేయడం, బంకుల వద్ద రియల్‌టైమ్ స్టాక్ సమాచారం అందించడం, అత్యవసర సేవలకు ప్రాధాన్యత కేటాయించడం వంటి చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. అదేవిధంగా, భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ఉండేందుకు దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించడం అవసరమని అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ ఇంధన సంక్షోభం ప్రభుత్వం మరియు సంబంధిత సంస్థల సమన్వయంపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. “కొరత లేదు” అనే అధికారిక ప్రకటనలకన్నా, నేలస్థాయిలో సమస్యలను పరిష్కరించడంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. మొత్తానికి, ఈ సంక్షోభం తాత్కాలికమా లేదా వ్యవస్థలో లోపాల సూచనా అన్నది పక్కనపెడితే, ప్రజల ఇబ్బందులు మాత్రం స్పష్టంగా కనిపిస్తున్నాయి. తక్షణ చర్యలతో పాటు, భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితులు ఎదురుకాకుండా చేయడం ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారింది.

## మహిళలు పిల్లల సంరక్షణ...



**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ 26**

డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం రామేశ్వరం గ్రామంలో పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో పోస్కో, సైబర్, సోషల్ మీడియాలో వైరల్ అయ్యే విషయాలనుండి పిల్లలను, మహిళలు కాపాడే ప్రయత్నంలో మహిళలతో సమావేశం నిర్వహించినట్లు ఎస్ఐ దుర్గాశ్రీనివాస్ తెలియాజేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు, సిబ్బంది, తదితరులు పాల్గొనారు.


## పెట్రోల్ కోసం క్యూ కట్టిన వాహనాదారులు



**రెడ్డిగూడెం ( సిటిజన్ టైమ్స్ ) ఏప్రియల్ 27**

ఎన్టీఆర్ జిల్లా, రెడ్డిగూడెం లోని పెట్రోల్ బంకు వద్ద ఉదయం నుంచి ద్విచక్ర వాహనాలు క్యూ కట్టాయి. ప్రస్తుతం ఉన్న అధికారులు సూచనల మేరకు ఈ ఫిల్లింగ్ స్టేషన్లో రెండు లీటర్ల చొప్పున ద్విచక్ర వాహనాలకు పెట్రోల్ ఫిల్ చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఐదు రోజులుగా డీజిల్ కొరత ఏర్పడినట్లు వాహనదారులు తెలిపారు. అధికారులు స్పందించి త్వరగా డీజిల్, పెట్రోల్ సమస్యను పరిష్కరించాలని వాహనాదారులు కోరుతున్నారు.

## పెట్రోల్, డీజిల్ ఇంధన సరఫరాను కలెక్టర్లు ఎస్పీలు పర్యవేక్షించాలి



**అమరావతి (సిటిజన్ టైమ్స్) ఏప్రిల్ 27**

పెట్రోల్ డీజిల్ కొరతపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులతో తెలియ కాన్ఫరెన్స్ నిర్వహించారు. డిస్పాచ్ సెంటర్ నుంచి ఆయిల్ ట్యాంకర్లు సాయంత్రం కల్లా బంకులకు చేరుకుంటాయని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. సరఫరా లో ప్రజలకు ఇబ్బందులు రాకుండా కలెక్టర్లు ఎస్పీలు పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. బ్లాక్ మార్కెట్ కృత్రిమ కొరత సృష్టించే వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమస్య పరిష్కారం అయ్యేవరకు ఆయిల్ కంపెనీలు నిరంతరం పనిచేయాలని సూచించారు.

## చందానగర్‌లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

### బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించిన సామ వెంకట్ రెడ్డి

**శేరిలింగంపల్లి (చందానగర్), సిటీజన్ టైమ్స్, ఏప్రిల్ 27**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శేరిలింగంపల్లి నియోజకవర్గం చందానగర్ డివిజన్‌లో వైభవంగా నిర్వహించారు. చందానగర్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద మాజీ కార్పొరేటర్ బొబ్బ నవత రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ మాజీ మినిమం వేజ్ బోర్డ్ చైర్మన్ సామ వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సామ వెంకట్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించి, పార్టీ నాయకులకు మరియు కార్యకర్తలకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, తెలంగాణ అభివృద్ధిలో బీఆర్ఎస్ పోషించిన కీలక పాత్రను ఆయన గుర్తుచేశారు. ఈ వేడుకల్లో మల్లికార్జున్ శర్మ, శ్రీకాంత్, రాజన్న, సలీం, చందర్ రావు, గౌస్, రామ రావు, బాబా, దివ్య రెడ్డి, సునీత, ప్రమోద్, సగేష్ రెడ్డి, శ్రీనివాస్, శివ శంకర, ఇబ్రహీం, అనంత రెడ్డి, ఇతర పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# కార్యకర్తలే అధినేతలు

**క్లస్టర్ ఇన్చార్జిల సమావేశంలో పార్టీ బలోపేతంపై దిశా నిర్దేశం చేసిన ఎంపీ కేశినేని చిన్ని ఎమ్మెల్సీ అశోక్ బాబు**

**టిడిపి కేంద్ర కార్యాలయంలో క్లస్టర్ ఇన్చార్జిల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని పలు అంశాలపై మాట్లాడిన కేశినేని చిన్ని**





**అమరావతి( సిటిజన్ టైమ్స్ ) : ఏప్రిల్ :27**

తెలుగుదేశం పార్టీలో కార్యకర్తలే కొండంత బలంగా పార్టీకి అండగా ఉంటారని క్యాడర్కు తగినటువంటి ప్రాధాన్యత ఇచ్చే టిడిపి అని ఎంపీ ఎమ్మెల్సీ స్పష్టం చేశారు. మంగళగిరి టిడిపి కేంద్ర కార్యాలయంలో జరిగిన క్లస్టర్ ఇన్చార్జిల సమావేశంలో కార్యకర్తలతో వాస్తవ పరిస్థితులపై ప్రభుత్వ పథకాల అమలుపై సుదీర్ఘంగా ఎంపీ కేశినేని చిన్ని చర్చించారు. ఈ సందర్భంగా కేశినేని చిన్ని మాట్లాడుతూ టిడిపిలో కార్యకర్తల అసలైన అధినేతలని కేడర్ లీడర్ అనే తేడా లేకుండా అందరూ సమానంగా ప్రాధాన్యత పొందే పార్టీ ఒక్క టిడిపి అని గుర్తు చేశారు.ప్రతి కార్యకర్తని నాయకుడిగా తీర్చిదిద్దడమే పార్టీ లక్ష్యమని కేడర్ సైతం అవకాశాలను అందిపుచ్చుకోవడం తెలుసుకోవాలని కోరారు.ప్రజలకు మంచి చేస్తే వారు నిరంతరం గుర్తుంచుకుంటారని సుదీర్ఘకాలం అధికారంలో ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని గుర్తు చేశారు. ప్రతి కార్యకర్తను నాయకుడిగా తీర్చిదిద్దే అవకాశం టిడిపి కల్పిస్తుందని సామాన్య కార్యకర్తగా వచ్చి నేడు పార్టీలో అత్యున్నతమైన పదవులలో ఉన్న వారు ఎందరో ఉన్నారని తెలియజేశారు. పార్టీని ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కేడర్కు ఐనా అందుబాటులో ఉండాలని సంస్థగతంగా పార్టీని బలోపేతం చేసి ప్రభుత్వ ఆశయాలను ప్రజల్లోకి గట్టిగా తీసుకువెళ్లాలని ఎంపీ చిన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అశోక్ బాబు టిడిపి కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీ నృసింహుని జయంతికి ఏర్పాట్లు..



**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ 27:**

డా బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంలో ఏప్రియల్ 30 తేదీన శ్రీ లక్ష్మీ నృసింహుని జయంతి కి కావలసిన ఏర్పాట్లు చేయడమైనదని, ఆరోజున వచ్చే స్వాములకు కావలసిన ఏర్పాట్లు చేస్తున్నట్లు, అర్చక స్వాములు చే వేధోతంగా హోమ గుండం నిర్మిస్తున్నట్లు అసిస్టెంట్ కమిషనర్ మోకా నాగవర ప్రసాదు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానాచార్యులు రామ రంగాచారి, రమేశాచార్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ చే చలివేంద్రం ప్రారంభం



**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 27**

ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అమలాపురం వారి ఆధ్వర్యంలో దాతల సహకారంతో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘ పచ్చిగోళ్ళ జనార్దన రావు కళ్యాణమండపం వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. బాటసారు ల దాహార్తిని తీర్చేందుకై ఈ మజ్జిగ చలివేంద్రము వేసవి కాలం ఉన్నంతకాలం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ముఖ్య సలహాదారుడు నంబూరి విశ్వనాథం, అధ్యక్షుడు యర్రమిల్లి విశ్వేశ్వరరావు, కార్యదర్శి నూలు సూరిబాబు, కోశాధికారి శ్రీఖాకోలపు రాంపండు తదితరులు పాల్గొని వారి సేవలను అందించారు.

## జేసీ నిధియా దేవిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు...



**కొత్తపేట సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 27**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోమ్ నిధియా దేవి ని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సోమవారం అమలాపురం ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జాయింట్ కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. దుశ్శాలువాతో సత్కరించి పూల మొక్కను అందజేశారు.

## కన్నుల పండుగగా లక్ష్మీ నరసింహస్వామి కళ్యాణం

**ఐ పోలవరం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 27**

మురమళ్ల: నిత్య కళ్యాణం పచ్చుతోరణం గా విరాజిల్లుతున్న మురమళ్ల శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరేశ్వర స్వామి వారి క్షేత్ర పాలకులు శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దివ్య కళ్యాణం వైశాఖ శుద్ధ ఏకాదశి సోమవారం మహా పర్వదినం పురస్కరించుకుని కన్నుల పండుగగా జరిగింది. అర్చకులు బ్రహ్మశ్రీ సుదర్శనం సత్యనారాయణ చార్యులు, బ్రహ్మశ్రీ పానంగిపల్లి సూర్యనారాయణ ఆచార్యులు ఆధ్వర్యంలో 5 రోజులు ఉత్సవాలు జరగనున్నాయి. ఇందులోభాగంగా కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా వీరేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ దాట్ల రామకృష్ణం రాజు, అసిస్టెంట్ కమీషనర్ వి.సత్యనారాయణ పట్టువస్త్రాలు సమర్పించారు. అసిస్టెంట్ కమీషనర్ వి.సత్యనారాయణ పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## "జిల్లాలో ఇంధన కొరతపై కలవరం వద్దు.. బంకులు మూసివేతపై భయపడొద్దు

**సరఫరా సజావుగా కొనసాగుతోంది -"ఇంధనంపై వదంతులకు కట్టడికి జిల్లా వ్యాప్తంగా ముమ్మరతనిఖీలు..**

**-వివిధ ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో జిల్లా అధికార యంత్రాంగం ఎప్పటికప్పుడు సంప్రదింపులు..**

**నిరంతర సరఫరాకు ఆదేశాలు జారీ --జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్**



**కాకినాడ సిటిజన్ టైం ఏప్రిల్ 27**

జిల్లాలో పెట్రోల్, డీజిల్ ఇంధన కొరత కారణంగా పలు పెట్రోల్ బంకులు మూసివేయడంపై భయాందోళనలు అవసరంలేదని,ఇంధన సరఫరా సజావుగా కొనసాగుతుందని జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ అన్నారు. ఇంధన కొరత,జిల్లాలో పలు పెట్రోల్ బంకులు మూసివేతపై ప్రజల్లో నెలకొన్న భయాందోళనలను నివారించేందుకు సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ పెట్రోల్ బంకులు, వివిధ కంపెనీల రిటైల్ అవుట్లెట్ యూనిట్లను తనిఖీ చేశారు. కాకినాడ రూరల్ మండలం వాకలపూడి లైట్స్ హౌస్ సమీపంలోని ఐఓసీఎల్, బీపీసీఎల్, నయారా ఇతర పెట్రోలు బంకుల రిటైల్ అవుట్ లైట్ యూనిట్ లను జేసీ అపూర్వ భరత్.. కాకినాడ ఆర్డీవో ఎస్ మల్లి బాబు ఇతర అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. బంకుల్లోని ఇంధన నిల్వలు, సరఫరా స్థితి, పంపిణీ వ్యవస్థను ప్రత్యక్షంగా పరిశీలించిన సంబంధిత ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇంధన కొరతపై వినియోగదారులు కలవరం చెందాల్సిన పని లేదన్నారు. జిల్లాలో కొన్నిచోట్ల బంకులు తాత్కాలికంగా మూసివేయడం సాంకేతిక లేదా నిర్వహణ సంబంధిత కారణాలు సరఫరా లోపం కారణంగానే మూసి వేయడం జరుగుతుందన్నారు. ఇంధనంపై వదంతులకు కట్టడికి జిల్లా వ్యాప్తంగా ముమ్మరతనిఖీలు చేపట్టడం జరిగిందన్నారు. జిల్లాలోని ఆయా ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు చేస్తూ జిల్లాలోని వినియోగదారుల అవసరాలకు తగిన విధంగా నిరంతరం సరఫరా చేసేలా స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. ప్రజలు వదంతులను నమ్మవద్దని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఇంధన సరఫరా పూర్తిగా నియంత్రణలో ఉందిని జేసీ తెలిపారు. జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా పెట్రోల్ బంకుల్లో ఇంధన సరఫరాపై వచ్చిన వార్తలను దృష్టిలో ఉంచుకుని కాకినాడ , పెద్దాపురం డివిజన్ల పరిధిలోని వివిధ మండలాల్లో క్షేత్రస్థాయి అధికారులు ముమ్మర తనిఖీలు చేపట్టామన్నారు. ప్రతి బంకులో అందుబాటులో ఉన్న నిల్వలు, రోజువారీ సరఫరా,విక్రయ పరిస్థితులపై సమగ్రంగా పరిశీలించి నివేదికలు సిద్ధం చేస్తున్నట్లు జేసి తెలిపారు.

## మంగళవారం మధ్యాహ్నం నాటికి జిల్లాలోని అన్ని బంకుల్లో పెట్రోల్ డీజిల్ పూర్తి స్థాయిలో నిల్వలు

**వరి కోత యంత్రాలకు డీజిల్ కూపన్లు పంపిణీ -పోలీస్, రెవెన్యూ, పౌరసరఫరాల శాఖల సమన్వయంతో ఇంధన సరఫరా, అమ్మకాలపై గట్టి పర్యవేక్షణ -జిల్లా కలెక్టర్**




**కాకినాడ సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 27**

జిల్లాలో పెట్రోల్ డీజిల్ సరఫరా పరిస్థితి మంగళవారం మధ్యాహ్నానికి సాధారణ స్థాయికి రానుందని, ఇందుకు ప్రజల సహకారం అవసరమని జిల్లా కలెక్టర్ ఎం ఎన్ హరేంధిర ప్రసాద్ తెలియజేశారు. సోమవారం రాత్రి జిల్లా కలెక్టర్, జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ జి.బిందు మాధవ్, జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, డిఎస్ఓ సీతారామరాజు లతో కలిసి కలెక్టరేట్ వివేకానంద హాలులో మీడియా సమావేశం నిర్వహించి జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత నివారణకు చేపట్టిన చర్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ సరఫరా పై నెలకొన్న అపోహల కారణంగా ప్రజలు పానిక్ కొనుగోళ్లు జరపడం వల్ల జిల్లాలోని 160 పెట్రోల్ బంక్ లలో శుక్రవారం నుండి పెట్రోల్ డీజిల్ కొరకు విపరీతమైన రద్దీ నెలకొందన్నారు. ఆయిల్ కంపెనీలు బల్క్ వినియోగదారులకు సరఫరా ధర పెంచడం కారణంగా, బల్క్ వినియోగదారులు రిటైల్ అవుట్ లెట్లలో కొనుగోలు జరపడం ఇందుకు కారణమైందన్నారు. జిల్లాలో రోజుకు సగటున 400 కిలోలీటర్లు డీజిల్ 300 కిలో లీటర్లు పెట్రోల్ జరిగే అమ్మకాలు గత రెండు రోజుల్లో రద్దీ కారణంగా దాదాపు 50 నుండి 60 శాతం వరకు డిమాండ్ పెరిగిందన్నారు. ప్రజలు జరుపుతున్న పానిక్ బయింగ్ వల్ల సోమవారం సాయంత్రానికి జిల్లాలోని 160 బంకుల్లో 28 బంకుల్లో నిల్వలు డ్రై అవుట్ అయ్యాన్నారు. ఈ పరిస్థితి నివారించేందుకు అవసరం లేకుండా పెట్రోల్ డీజిల్ కొనుగోలు చేయవద్దని జిల్లా కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అలాగే ఇంధన ధరలు పెరుగుతాయని జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని కోరారు. డ్రై అవుట్ అయిన 28 బంకులు సరఫరా కోసం ఆయిల్ కంపెనీలకు ఇండెంట్ చేశాయని, మంగళవారం మధ్యాహ్నం పెట్రోల్ డీజిల్ సరఫరాలు తిరిగి సాధారణ స్థితికి వస్తాయని కలెక్టర్ తెలియజేశారు. 15 మండలాల్లో వరి కోతలు జరుగుతున్నాయని, ఇప్పటివరకు 58 వేల ఎకరాల్లో కోతలు పూర్తి కాగా, మరో లక్షా 50 వేల ఎకరాల్లో వరి కోతలు జరగాల్సిందన్నారు. పంట కోతలకు సమస్య లేకుండా వరి కోత యంత్రాలకు డీజిల్ సరఫరాకు ప్రత్యేక విధానం చేపట్టామన్నారు. ప్రతి హార్వెస్టర్కు రోజుకు 70 లీటర్లు డీజిల్ సరఫరా చేసేందుకు కూపన్లు జారీ చేస్తున్నామన్నారు. వరి కోత యంత్రాలు నిర్వహించేవారు తమ సమీప సచివాలయం అగ్రికల్చర్ అసిస్టెంట్ ను సంప్రదిస్తే మండల అగ్రికల్చర్ ఆఫీసర్, తాసిల్దార్ లు డీజిల్ కూపన్లు జారీ చేస్తారన్నారు. వరికోత యంత్రాలకు కేన్లు, టిన్ లలో కూడా సరఫరా చేసేందుకు అనుమతించామన్నారు. బంకులలో కొనుగోలు చేసిన ఇంధనాన్ని దాచిపెట్టడం, బయట ఎక్కువ ధరకుక అమ్మడం వంటి వాటికి ఎవరైనా పాల్పడితే కఠినచర్యల తీసుకుంటామని స్పష్టం చేశారు. పెట్రోల్ డీజిల్ సరఫరా పర్యవేక్షించేందుకు పోలీస్,రెవెన్యూ, పౌర సరఫరాల శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయన్నాయని, పరిస్థితిని చక్కదిద్దేందుకు జిల్లా యంత్రాంగం చేపట్టిన చర్యలకు ప్రజలు సహకరించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## పారపట్లలో చౌక దుకాణం ప్రారంభం



**కలికిరి మండల రిపోర్టర్ సిటిజన్ టైమ్స్ 27 ఏప్రిల్ 4.**

కలికిరి మండలం పార పట్ల నూతన చౌక దుకాణం ప్రారం బానికి మండల్ తహసీల్దార్ హాజరై రిబ్బన్ కట్ చేశారు. పారపట్ల గ్రామంలోని కాలనీ కురవపల్లి వీరికి పారపట్లలో నీ డి లలిత కుమారికి డీలర్ గా బాధ్యతలు అప్పజెప్పారు. కావున మెరుగైన సేవలు అందుబాటులో ఉన్నాయని గ్రామంలోని ప్రజలందరూ సకాలంలో చౌక దుకాణంలోని సరుకులను సకాలంలో తీసుకొని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

## వివోఎ, మెప్మా, ఆర్పీ ఉద్యోగుల కలెక్టరేట్ ధర్నా

**కాకినాడ,(సిటిజన్ టైమ్స్ )ఏప్రిల్ 27**




ఏపీ వెలుగు వివోఏ యానిమేటర్ల ఉద్యోగుల సంఘం, ఏపీ మెప్మా, ఆర్పి ఉద్యోగుల సంఘం సిఐటియు ఆధ్వర్యంలో ఐదు నెలల వేతన బకాయిలు చెల్లించాలని, రాజకీయ వేధింపులు అరికట్టాలని, 10 లక్షల జీవిత బీమా కల్పించాలని, పది లక్షల రుణాల వరకు వడ్డీ మాఫీ చేయాలని, శ్రీనిధి ఇంటెన్సీవ్ లు, స్వాలంబన, అభయహస్తం, మహిళా మార్ట్ ల పేరుతో పెట్టిన పెట్టుబడులు మహిళా సంఘాలకు తిరిగి చెల్లించాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని కోరుతూ కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ కు అందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు బేబీరాణి, ప్రధాన కార్యదర్శి ఈశ్వరి భాయ్ మాట్లాడుతూ, ప్రభుత్వాలు మారుతున్నా వివోఎ, ఆర్పీ, మెప్మాల జీవితాలలో ఏ మార్పు రావడంలేదని, నెలలు తరబడి వేతనాలు బకాయిలు పెడితే ఎలా జీవించాలని ప్రశ్నించారు. బకాయి పెట్టిన ఐదు నెలల వేతనాలను తక్షణం వివోఏల అకౌంట్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. మాకు సంబంధం లేని పనులన్నీ మెప్మాలపై, వివోఏలపై, ఆర్పీలపై రుద్దుతూ పని ఒత్తిడి తీవ్రంగా పెంచారని, సెల్ ఫోన్లు ఇచ్చి సిమ్ములు ఇవ్వడం మానేశారని, రీచార్జిలు కూడా సొంత డబ్బులతో చేయించుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం పని ఒత్తిడి తగ్గించి, ప్రభుత్వమే సిమ్ము, రిచార్జ్ చేయించాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటి జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజకుమార్, జిల్లా కోశాధికారి మలకా రమణ, లోవకుమారి, మేరి, పద్మ, సత్యవేణి, ఈశ్వరి, శివ, రాజు, దేవి, శ్రీలత , కృష్ణమ్మ , సత్య తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎంపీ హరీష్ బాలయోగి...

డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట గ్రామంలో జరిగిన బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలలో అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంబేద్కర్ వారి సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.



# ఆ ఇద్దరి భామల నయా స్ట్రాటజీ!










హీరోయిన్ల పాత్రల్లో ఎన్నో రకాల మార్పులు చోటుచుసుకుంటున్నాయి. ఒకప్పుడు స్టార్ హీరోయిన్ అంటే కేవలం పెద్ద సినిమాల్లో గ్లామర్ కోసమో? పాటల కోసమో? అనే భావన ఉండేది. కానీ దీపికా పదుకోణే, రష్మికా మందన్నా వంటి అగ్ర కథానాయికలు ఆ మూస పద్ధతిని తాజాగా చెరిపేస్తున్నట్లే కనిపిస్తుంది. కెరీర్ ప్లానింగ్‌లో భారీ కమర్షియల్ చిత్రా లతో పాటు కంటెంట్ ఉన్న చిన్న సినిమాలను , నటనకు ఆస్కారం ఉన్న పాత్రలను ఎంచుకుంటూ సరికొత్త వ్యూహాన్ని అనుసరిస్తున్నారు. దీపికా పదుకోణే కెరీర్‌ను గమనిస్తే కమర్షియల్ పాత్రలకు పూర్తిగా దూరం కాకుండా తెలివైన ఆట ఆడుతోంది.ఓవైపు ఆ తరహా పాత్రలకు కమిట్ అవుతూనే? మరోవైపు -గెహ్రాయియాన్-, -పద్మావత్- వంటి ప్రయోగాత్మక చిత్రాల్లోనూ సత్తా చాటిన సంగతి తెలిసిందే. స్టార్ హీరోల సరసనే కాకుండా? కథను మలుపు తిప్పే బలమైన పాత్రల కోసం దీపిక ఫోకస్ చేసి పని చేస్తోంది. ఇది అమ్మడి మార్కెట్ విలువను పెంచడమే కాదు. నటిగా ఆమెలోని విలక్షణతను ప్రపంచానికి చాటి చెబుతోంది. టాలీవుడ్ సంచలనం రష్మిక మందన్నా? కూడా ఇదే బాటలో నడుస్తోంది. -పుష్ప- వంటి కమర్షియల్ సక్సెస్‌ల తర్వాత అమె కేవలం భారీ చిత్రాలకే పరిమితం కాకుండా? -మైసా- వంటి యాక్షన్ ఓరియెంటెడ్ రోల్స్ , చిన్న సినిమాల్లోనూ నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలకు కమిట్ అవుతోంది.గ్లామర్ కంటే పర్ఫార్మెన్స్‌కే ఎక్కువ మార్కులు పడతాయని గ్రహించిన రష్మిక విభిన్నమైన జోనర్లను ప్రయత్నిస్తోంది. అలా అమ్మడు తన ఇమేజ్‌ను మార్చుకుంటోంది. ఈ నేపథ్యంలో రష్మికకు అన్ని భాషల ప్రేక్షకులలో ఆదరణ పెరుగుతోంది. ఈ నయా స్ట్రాటజీ వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం లాంగ్ కెరీర్. గ్లామర్ అనేది ఒక వయసు వరకే పరిమితం. కానీ నటన అనేది దశాబ్దాల పాటు గుర్తింపును ఇస్తుందని నేటి తరం హీరోయిన్లు నమ్ముతున్నారు. చిన్న సినిమాల్లో నటించడం వల్ల నటిగా వారి ప్రతిభకు పదును పెట్టడమే కాదు.కొత్త దర్శకులకు అండగా నిలిచినట్లు అవుతుంది. దీంతో పరిశ్రమలో వారి గౌరవం పెరుగుతుంది.అలాగే ఓటీటీ విప్లవం కూడా హీరోయిన్ల ఆలోచనా విధానంలో మార్పు తెచ్చిందన్నది కాదనలేని నిజం. పెద్ద సినిమాల్లో అతిథి పాత్రల కంటే? చిన్న సినిమాల్లో , వెబ్ సిరీస్‌లలో లీడ్ రోల్స్ వచ్చే గుర్తింపుతో మంచి అవకాశాలు ఒడిసి పట్టుకుంటున్నారు. బాక్సాఫీస్ లెక్కల కంటే ప్రేక్షకులు కంటెంట్‌కే పట్టం కడుతున్నారు. అందుకే స్టార్ హోదా ఉన్నా? రిస్క్ తీసుకొని విభిన్నమైన కథలను ఎంచుకోవడం హీరోయిన్ల ధైర్యానికి - దూరదృష్టికి నిదర్శనం. దీపికా పదుకొణే, రష్మికా మందన్నా? వంటి భామలు సృష్టిస్తోన్న ఈ ట్రెండ్ రాబోయే తరం హీరోయిన్లకు దిక్సూ చిలా మారుతోంది. గ్లామర్ అనేది అలంకారం మాత్రమేనని అసలైన బలం నటనలోనే ఉందని ఈ భామలు నిరూపిస్తున్నారు.

# ఎంఎస్ ధోని 15 ఏళ్ల రికార్డును బద్దలు కొట్టిన రింకు సింగ్





ఐపీఎల్ 2026లో భాగంగా లక్నోలోని ఏకానా స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో రింకూ సింగ్ మరోసారి అసాధ్యమైన దానిని సుసాధ్యం చేసి చూపించాడు. లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన ఈ పోరులో రింకూ విధ్వంసకర ఇన్నింగ్స్‌తో కేకేఆర్‌కు చారిత్రాత్మక విజయాన్ని అందించడమే కాకుండా, టీమిండియా మాజీ కెప్టెన్, మహేంద్ర సింగ్ ధోనీ పేరిట ఉన్న 15 ఏళ్ల నాటి రికార్డును సైతం బద్దలు కొట్టాడు. నంబర్ 6లో బ్యాటింగ్‌కు వచ్చి, ఐపీఎల్ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో అత్యధిక పరుగులు చేసిన భారతీయ బ్యాటర్‌గా రింకూ సింగ్ నిలిచాడు.

**ఐపీఎల్ చరిత్రలో నంబర్ 6లో చేసిన అత్యధిక స్కోర్లు:**

ఆంద్రీ రస్సెల్ – 88లి (2018)
రింకూ సింగ్ – 83 (2026)లి
ఎంఎస్ ధోనీ – 70లి (2011)

**మ్యాచ్ ని మలుపు తిప్పిన ఇన్నింగ్స్:**

ఒకానొక దశలో కేకేఆర్ 15 ఓవర్లకు 93/7 స్కోరుతో పీకల్లోతు కష్టాల్లో పడింది. కేమెరూన్ గ్రీన్ (34) మినహా మిగిలిన వారంతా విఫలమయ్యారు. ఆ సమయంలో

రింకూ సింగ్, సునీల్ నరైన్‌తో కలిసి 8వ వికెట్‌కు కేవలం 30 బంతుల్లోనే 62 పరుగులు జోడించాడు. చివరి ఓవర్‌లో వరుసగా 4 సిక్సర్లు బాది స్కోరును 155/7కు చేర్చాడు. ఇది రింకూ ఐపీఎల్ కెరీర్‌లోనే అత్యుత్తమ స్కోరు (83లి).

**ఉత్కంఠభరిత సూపర్ ఓవర్:**

156 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన లక్నో జట్టు కూడా తడబడింది. అయితే చివరి ఓవర్‌లో మహమ్మద్ షమీ సిక్సర్ బాదడంతో మ్యాచ్ టై అయి సూపర్ ఓవర్‌కు దారితీసింది. ఇక సూపర్ ఓవర్ వేసిన సునీల్ నరైన్ కేవలం 1 పరుగు మాత్రమే ఇచ్చి 2 వికెట్లు తీశాడు. దీంతో 2 పరుగుల లక్ష్యాన్ని రింకూ సింగ్ మొదటి బంతికే ఫోర్ కొట్టి కేకేఆర్‌కు విజయాన్ని అందించాడు.

# రూ. 100 ఇస్తేనే సెల్ఫీ ఫోటో ఇస్తా.. ఫ్యాన్స్ నుంచి డబ్బులు వసూల్ చేసిన వైభవ్ సూర్యవంశీ





ఐపీఎల్ 2026లో అత్యంత పిన్న వయస్కుడైన ఆటగాడిగా ఎంట్రీ ఇచ్చి, ప్రపంచ దిగ్గజ బౌలర్లను వణికిస్తున్న వైభవ్ సూర్యవంశీ హాట్ టాపిక్ గా మారిపోయాడు. కేవలం 15 ఏళ్ల వయసులోనే రాజస్థాన్ రాయల్స్ (==) జట్టులో కీలక సభ్యుడిగా ఎదిగిన ఈ యువ సంచలనం, తన బ్యాటింగ్‌తోనే కాకుండా తన అల్లరితోనూ నెటిజన్ల మనసు గెలుచుకుంటున్నాడు.

**ఫొటో కోసం రూ. 100:**

తాజాగా వైభవ్ సూర్యవంశీ తన చిలిపి తనంతో వార్తల్లో నిలిచాడు. తనతో ఫొటో దిగేందుకు వచ్చిన ఇద్దరు చిన్నారులను చూసి వైభవ్ సరదాగా ప్రాంక్ చేశాడు. నేను ఫొటో దిగాలంటే ఒక్కో దానికి రూ. 100 ఇవ్వాలి అని అనడంతో, ఆ పిల్లలు అమాయకంగా రూ. 200 తెచ్చామని చెప్పారు. ఇది చూసి అక్కడి వారంతా నవ్వుకున్నారు.. ఆ తర్వాత వైభవ్ నవ్వుతూ ఆ పిల్లలతో ఫొటో దిగి వారిని సంతోష పెట్టాడు. దీనికి సంబంధించిన వీడియోను రాజస్థాన్ రాయల్స్ సోషల్ మీడియాలో షేర్ చేయగా, "పిల్లాడే పిల్లలతో ఆడుకుంటున్నాడు" అంటూ అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు.

**వరల్డ్ క్లాస్ బౌలర్లకు చుక్కలు:**

సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన గత మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ ఆడిన ఇన్నింగ్స్ ఒక సంచలనం. ప్రపంచ అత్యుత్తమ బౌలర్, ఎస్ఆర్‌హెచ్ కెప్టెన్ పాట్ కమిన్స్ వేసిన తొలి బంతినే సిక్సర్‌గా మలిచి వైభవ్ తన పవర్ ఏంటో చూపించాడు. కేవలం కమిన్స్ మాత్రమే కాదు.. బుమ్రా, హేజిల్‌వుడ్, భువనేశ్వర్ కుమార్, రబాడ లాంటి స్టార్ బౌలర్ల బౌలింగ్‌లోనూ తొలి బంతినే బౌండరీకి పంపి తన 'ఫియర్‌లెస్' గేమ్‌ను ప్రదర్శించాడు. కాగా వైభవ్ బ్యాటింగ్‌కు ఫిదా అయిన కమిన్స్, అతన్ని తన "ఫేవరెట్ ప్లేయర్" అని కొనియాడటం విశేషం.

**దిగ్గజాల ప్రశంసలు:**

వైభవ్ సూర్యవంశీ ప్రతిభను చూసి మాజీ క్రికెటర్లు ఆశ్చర్యపోతున్నారు. మరో 25 ఏళ్ల పాటు వైభవ్ భారత క్రికెట్‌ను శాసిస్తాడు అని మహమ్మద్ కైఫ్ పేర్కొన్నాడు. ఐపీఎల్‌ను గల్లీ క్రికెట్ ఆడినంత ఈజీగా ఆడుతున్నాడు

అంటూ ప్రశంసించారు. టీమిండియా మాజీ కెప్టెన్ క్రిష్ శ్రీకాంత్ ఏకంగా వైభవ్ ఆట తీరును సచిన్ టెండూల్కర్‌తో పోల్చారు. అయితే రాజస్థాన్ రాయల్స్ విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న ఈ 'బుడ్డోడు' భవిష్యత్తులో భారత జట్టుకు కూడా ప్రధాన బలమవుతాడని క్రీడా విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# ఢిల్లీ క్యాపిటల్స్ వర్సెస్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య రసవత్తర పోరు.. విరాట్ కోహ్లీతో ఓపెనింగ్ చేసేది ఎవరు?







ఐపీఎల్ 2026లో భాగంగా కాసేపట్లో మరో రసవత్తర పోరు జరగనుంది. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్ వర్సెస్ డిఫెండింగ్ ఛాంపియన్స్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ) జట్లు తలపడనున్నాయి. ఈ సీజన్‌లో ఇప్పటికే బెంగళూరులో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ విజయం సాధించింది. మరి ఈసారి సొంత గడ్డపై ఢిల్లీ ఆధిపత్యం చాటుతుందా? లేక ఆర్‌సీబీ ప్రతీకారం తీర్చుకుంటుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.

**కోహ్లీతో ఓపెనింగ్ చేసేది ఎవరు?:**

ఆర్సీబీ జట్టుకు ప్రస్తుతం ఓపెనింగ్ సమస్య వేధిస్తోంది. స్టార్ ఓపెనర్ ఫిల్ సాల్ట్ గాయం కారణంగా ఈ మ్యాచ్‌కు అందుబాటులో లేరు.. నెట్ ప్రాక్టీస్ సమయంలో అతను గాయపడినట్లు మెంటర్, బ్యాటింగ్ కోచ్ దినేష్ కార్తీక్ స్పష్టం చేశారు. సాల్ట్ స్థానంలో గత మ్యాచ్‌లో ఆశించిన స్థాయిలో రాణించని జాకబ్ బెథెల్ ఆడే ఛాన్స్ ఉంది. ఈ మ్యాచ్‌లో కూడా కోహ్లీకి జోడీగా బెథెల్ ఓపెనింగ్ చేసే ఛాన్స్ కనిపిస్తుంది.

**హెడ్ టు హెడ్ రికార్డులు:**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో ఇప్పటి వరకు ఢిల్లీ క్యాపిటల్స్ పై బెంగళూరుదే పైచేయి సాధించింది. ఇరు జట్ల మధ్య మొత్తం 34 మ్యాచులు జరగ్గా, ఆర్సీబీ 20 మ్యాచులలో విజయం సాధించగా, ఢిల్లీ మాత్రం కేవలం 13 మ్యాచులలో గెలిచింది. ఒక మ్యాచ్ డ్రా అయింది. అయితే 2021 నుండి జరిగిన 9 మ్యాచ్‌ల్లో ఆర్‌సీబీ ఏకంగా 6 సార్లు విజయం సాధించింది.

**ఏ జట్టు గెలుస్తుందంటే?:**

గత సీజన్ ఛాంపియన్లుగా బరిలోకి దిగిన ఆర్‌సీబీ, ఈ సీజన్‌లో ఆడిన 7 మ్యాచ్‌ల్లో 5 గెలిచి ఫుల్ ఫామ్‌లో ఉంది. విరాట్ కోహ్లీకి ఇది సొంత మైదానం కావడంతో ఆర్‌సీబీ హాట్ ఫేవరెట్‌గా కనిపిస్తోంది. ఇక అక్షర్ పటేల్ నేతృత్వంలోని ఢిల్లీ వరుస ఓటములతో సతమతమవుతోంది. ముఖ్యంగా గత మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్‌పై 265 పరుగులు చేసినా కాపాడుకోలేకపోవడం వారి బౌలింగ్ వైఫల్యాన్ని సూచిస్తోంది.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776